జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




కృష్ణ మంగళవారం 14 ఏప్రిల్ 2026 సంపుటి : 01 సంచిక : 281 పేజీలు : 12 వెల : 4/- PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ప్రజల భద్రత, పర్యావరణంపై జాగ్రత్తల విషయంలో

# రాజీ పడొద్దు



- కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం భేటీ
- కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సమీక్ష
- పరిశ్రమల ఏర్పాటులో వేగం అనుమతుల్లో సులభతరంపై చర్చ
- ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- విద్యుత్ కనెక్షన్లను త్వరగా అందించాలి
- ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి

**అమరావతి**

పరిశ్రమలు ఏర్పాటులో జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల తొలగింపునకు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. పారిశ్రామిక ప్రగతికి మే నాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు చేయాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలన్నారు. అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్రం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సీఎంతో సమావేశమయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం - మిగతా3లో

# కొత్తగా మరో 62 అన్న క్యాంటీన్లు



- రాష్ట్రంలో 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య
- 5న ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం

**అమరావతి**

కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే - మిగతా3లో



## పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

- నారీ శక్తి వందన్ సమ్మేళన్‌లో ప్రధాని కీలక వ్యాఖ్యలు
- మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దపు పెద్ద నిర్ణయం
- 2029లోగా అమలు చేయాలని లక్ష్యం
- అన్ని పార్టీల సహకారం అవసరమని మోదీ పిలుపు

## మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- రాజకీయ లబ్ధి కోసమే మోదీ సర్కార్ అలా చేస్తోంది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్న కేంద్రం
- మహిళా రిజర్వేషన్ చట్టానికి తాము వ్యతిరేకం కాదన్న ఖర్గే
- నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించిన సోనియా గాంధీ



## ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం

# అమరావతి



- 'అమరావతి'కి అండగా నిలిచారు..
- ఏపీ రాజధాని చట్టబద్ధతకు ఆమోద ముద్ర వేశారు
- ఐదుకోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారా లోకేష్
- అమరావతి చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి

**ఢిల్లీ**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్ట బద్ధత కల్పిస్తూ పార్లమెంటు చేసిన చట్టానికి ఆమోద ముద్ర వేసినందుకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలియజేశారు. మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా తల ఎత్తి చాటేలా చారిత్రక అమరావతి రాజధాని చట్టంపై సంతకం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు రాష్ట్రపతి భవన్‌లో సోమవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. విభజనతో కోలుకోని విధంగా ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, రాజధాని లేని రాష్ట్రంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి.. ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ చట్టం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముగారికి ఆంధ్రజాతి - మిగతా3లో




## అమరావతిలో మరో కీలక ఘట్టం

- రేపు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ప్రారంభం
- రేపు కీలక ఘట్టానికి వేదిక కానున్న రాష్ట్రం
- రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- మేధా టవర్స్‌తో పాటు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు




## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

- రేపటికల్లా ఎల్‌పీజీతో భారత్‌కు 'జగ్ విక్రమ్'
- 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని వెల్లడి
- ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు
- వాటిని వీలైనంత త్వరగా హర్మూజ్ దాటిస్తాం: కేంద్రం



## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

- జనసేనాని విత్ జెన్‌జీ కార్యక్రమంలో విజయ్‌పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో రాణించడానికి విజయ్‌కు సలహా ఇస్తారా అని ప్రశ్న



## మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

- మమతపై అమిత్ షా ఫైర్
- రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దన్నారు
- మహిళా సీఎంగా మహిళలకు ఇచ్చిన సలహాకు మమత సిగ్గుపడాలి
- బీజేపీ వస్తే, యువతులు అర్ధరాత్రీ స్కూటర్‌పై తిరగొచ్చు
- బంగాల్ ఎన్నికల ర్యాలీల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- దొంగఓట్లు అరికట్టేందుకు బయోమెట్రిక్స్ నమోదు చేయాలని సుప్రీంకోర్టులో పిల్
- ఎన్నికల నిర్వహణపై కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు



# పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

దేశం కొత్త చరిత్రను లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయాల్లో ఒకటిగా నిలిచే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు భారత్ సిద్ధమవుతోందని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఈ నిర్ణయం పూర్తిగా మహిళల సాధికారతకు అంకితమైందని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో కీలక దశలో ఉన్న ఈ సమయంలో మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని మోదీ అన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న మహిళా రిజర్వేషన్ అంశంపై ఇప్పుడు స్పష్టమైన ముందడుగు పడబోతోందని పేర్కొన్నారు. “ఇది కేవలం ఒక బిల్లు కాదు. మహిళల శక్తికి అంకితమైన నిర్ణయం. దేశ భవిష్యత్తు సంకల్పాలను నెరవేర్చే దిశగా ఇది కీలకమైన అడుగు” అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అవసరం దాదాపు నాలుగు దశాబ్దాలుగా చర్చలో ఉందని, అన్ని రాజకీయ పార్టీలూ తమ తమ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చాయని మోదీ గుర్తు చేశారు. 2023లో పార్లమెంట్‌లో నారీ శక్తి వందన్ అధినియమాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ సమయంలోనే 2029లోగా అమలు చేయాలని అన్ని పార్టీలు కోరిన విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు.

**రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని మోదీ పిలుపు**

ఈ నేపథ్యంలో 2029ను లక్ష్యంగా పెట్టుకుని మహిళా రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని



తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో ఈ అంశంపై సమగ్ర చర్చలు జరగనున్నాయని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని పిలుపునిచ్చారు. “సమష్టి కృషితో పార్లమెంట్ గౌరవం మరింత పెరుగుతుంది. దేశంలోని ప్రతి మహిళ గర్వపడేలా ఈ నిర్ణయం ఉండాలి” అని అన్నారు. మహిళల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా, పాలనలో సహజ భాగంగా మారాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఈ బిల్లు ఆ దిశగా ఒక పెద్ద అడుగు అవుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళల పాత్రను ఉదాహరణగా చూపిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది మహిళలు స్థానిక సంస్థల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. సుమారు 14 లక్షలకుపైగా మహిళలు స్థానిక సంస్థల్లో సేవలందిస్తున్నారని, కొన్ని రాష్ట్రాల్లో వారి ప్రాతినిధ్యం 50 శాతానికి చేరుకుందని వివరించారు. ఇది మహిళల నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

**మహిళలకు తోడుగా ఉండే విధంగా!**

దేశంలో రాష్ట్రపతి నుంచి ఆర్థిక మంత్రివరకు కీలక పదవుల్లో మహిళలు సేవలందించడం గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. మహిళలు తమ ప్రత్యేకమైన రాజకీయ వారసత్వాన్ని నిర్మించుకుంటున్నారని, ఇది దేశ అభివృద్ధికి కీలకమని చెప్పారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అనేక పథకాలు అమలు చేస్తోందని ప్రధాని వివరించారు. పుట్టినప్పటి నుంచి జీవితాంతం వరకు మహిళలకు తోడుగా ఉండే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందించామని చెప్పారు. ఇక మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక అంశాల్లో జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) కూడా భాగమని సమాచారం. ప్రస్తుతం జనగణన ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2011 జనగణన ఆధారంగా ఈ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. డెలిమిటేషన్ అనంతరం లోక్‌సభ స్థానాలు పెరగవచ్చని అంచనా. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన సవరణ బిల్లు, అలాగే డెలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ రెండు బిల్లులు రాజ్యాంగ సవరణలుగా ఆమోదం పొందాల్సి ఉంటుంది. మొత్తానికి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ నిర్ణయం దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశముంది.

# మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. “మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కానీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అందుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నారీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎవరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి.”

**మోదీ సర్కార్‌పై సోనియా ఫైర్**

అలాగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు, మహిళా రిజర్వేషన్ల చట్టం తదితర అంశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ సైతం మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. నియోజకవర్గాల



పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. అలాగే ఈ ప్రక్రియను రాజ్యాంగంపైన చేస్తున్న దాడిగా పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కులగణనను మరింత ఆలస్యం చేసి, దాన్ని పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశమని ఆరోపించారు.

“తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని చూస్తోంది. బలవంతంగా ఆమోదింపజేయాలనుకుంటున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తొందరపాటుకు ఒక కారణం ఉంది. రాజకీయ లబ్ధి పొందడం కోసం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం కోసమే మోదీ ఇలా చేస్తున్నారు. ప్రధాని మోదీ ఎప్పటిలాగే నిజాన్ని దాచిపెడుతున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణలపై చర్చించడానికి బంగాల్ చివరి దశ ఎన్నికలు (ఏప్రిల్ 29) ముగిసిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు ప్రభుత్వానికి ఏకంగా మూడుసార్లు లేఖలు రాశారు. కానీ మోదీ సర్కార్ విపక్షాల అభ్యర్థనను తిరస్కరించింది. అందుకు బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో తన మాటే నెగ్గాలి అన్నట్లు మోదీ వ్యవహరిస్తున్నారు. నారీ శక్తి వందన అధినియం సవరణ బిల్లును పార్లమెంట్ స్పెషల్ సెషన్‌లో కాకుండా పార్లమెంట్ వర్షాకాల సమావేశంలోనే తీసుకురావాలని కోరుతున్నాను.” అని సోనియా గాంధీ పేర్కొన్నారు.

**ఆ హక్కులను పది కోట్ల మంది కోల్పోయారు : సోనియా గాంధీ**

నారీ శక్తి వందన్ అధినియం- 2023 చట్టం 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లుల విజయాల పునాదిపైనే రూపుదిద్దుకుందని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆ సవరణ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతే పంచాయతీలు, నగరపాలక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021లోనే జరగాల్సి ఉందని, కానీ మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చిందని మండిపడ్డారు. దీని పర్యవసానంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ప్రాతిపదికగా నిలిచే జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద లభించే చట్టపరమైన హక్కులను 10 కోట్లకు పైగా ప్రజలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు.

**కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ**

మరోవైపు, నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి తమ పార్టీ లోక్‌సభ ఎంపీలందరూ తప్పక హాజరుకావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. ఏప్రిల్ 16-18 వరకు సభలో అత్యంత కీలకమైన కొన్ని అంశాలపై చర్చ, ఓటింగ్ జరగనున్నాయని తమ పార్టీ ఎంపీలకు సూచించింది. ఆ మూడు రోజులు ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడేంత వరకు తప్పనిసరిగా సభలో ఉండాలని కోరింది. పార్టీ వైఖరికి మద్దతు తెలపాలని కోరుతూ విప్‌ను జారీ చేసింది.

# మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

మహిళా ముఖ్యమంత్రి అయినప్పటికీ మమతా బెనర్జీ బంగాల్ సోదరీమణులకు భద్రతను కల్పించలేక పోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ రేప్ కేసుపై మమత స్పందిస్తూ, రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దని మహిళలకు సలహా ఇచ్చారని ఆయన విమర్శించారు. ఒక మహిళా సీఎంగా మహిళామణులకు ఆ విధమైన సలహా ఇచ్చినందుకు మమత సిగ్గుపడాలని షా ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మహిళలకు భద్రతను కల్పించడంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం విఫలమైందన్నారు. సోమవారం బీర్భూమ్ జిల్లా మయూరేశ్వర్, ఖేరాసోల్, పశ్చిమ్ బర్ధమాన్ జిల్లా రాణీ గంజ్‌లలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే, యువతులు అర్ధరాత్రి 1 గంటలకూ స్కూటర్‌పై ప్రయాణించే సురక్షిత పరిస్థితి బంగాల్‌లో వస్తుందన్నారు. సందేశ్ ఖాలి, ఆర్‌జీ కర్, దుర్గాపూర్ లా కాలేజ్ (దక్షిణ కోల్‌కతా లా కాలేజ్) తరహా పైశాచిక ఘటనలు ఇక జరగవని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

**అల్లర్లు జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు?**

“ఇప్పుడే నేను మమతా బెనర్జీ ప్రసంగం ఒకటి విన్నాను. అందులో ఆమె మెజారిటీ సామాజిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికల్లో టీఎంసీ గెలవకుంటే, మెజారిటీ సామాజిక వర్గం మనుగడ సాధ్యం కాదని మమత అంటున్నారు. టీఎంసీ పాలనలోనే ముర్షిదాబాద్ అల్లర్లు జరిగాయన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. రామ నవమి వేడుకలపైనా దాడులు జరిగాయి. సరస్వతీ పూజపై నిషేధం విధించారు. అవన్నీ జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు? రాష్ట్రంలోని మెజారిటీ సామాజిక వర్గాన్ని సీఎం మమత భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీదీ మేం ఎన్నో శతాబ్దాలుగా ఇదే దేశంలో నివసిస్తున్నాం. మమ్మల్ని బెదిరించడానికి మీరెవ్వరు? అయోధ్యలో రామ్ లల్లాను 550 ఏళ్ల పాటు టెంటు కింద ఉంచడానికి మమతా



బెనర్జీ లాంటి నేతలే కారకులు. చివరకు ప్రధాని మోదీ సారథ్యంలోనే అయోధ్య రామమందిరం నిర్మాణం జరిగింది. మమతా బెనర్జీ తొత్తు హుమాయూన్ కబీర్ బంగాల్‌లో బాబ్రీ మసీదును నిర్మించాలని కోరుతున్నారు. కానీ అందుకు బీజేపీ అస్సలు అనుమతించదు” అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. “ఈ ఎన్నికలు బంగాల్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారుతాయి. టీఎంసీ గూండాలు ఇకపై బాంబు పేలుళ్లతో బంగాల్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేరు. బంగాల్ ప్రజలు ఆ బాంబులకు బ్యాలట్లతో, భయానికి విశ్వాసంతో సమాధానం ఇస్తారు. బంగాల్ ప్రజలంతా కమలం (తామర పువ్వు) గుర్తుకే ఓటేయాలి. బంగాల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు అనేది గోడపై రాత లాంటిది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి టాటా బైబై చెప్పాలని బంగాల్ ప్రజలు డిసైడయ్యారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే అందరు టీఎంసీ గూండాల భరతం పడుతుంది. నేను ఇవాళ టీఎంసీ గూండాలకు ఒకే విషయం చెబుతున్నాను. మొదటిదశ పోలింగ్ జరగనున్న ఏప్రిల్ 23న మీరంతా ఇళ్లలోనే ఉండండి. లేదంటే మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చాక మిమ్మల్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టిస్తాం. బీజేపీ గెలవగానే టీఎంసీ ప్రభుత్వంలోని సిండికేట్లు, అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీసి సరి చేసే బాధ్యతను తీసుకుంటుంది. నేరచరితులకు నెలవుగా టీఎంసీ మారింది. ఆ నేరచరితులే చాలా ఏళ్లుగా బంగాల్‌లోని బీజేపీ క్యాడర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు జరిగిన మరుసటి రోజు (మే 5న) బీజేపీ కార్యకర్తలు తమను హింసించిన టీఎంసీ గూండాలను బయటకు లాగి న్యాయస్థానాల ఎదుట నిలబెడతారు” అని అమిత్ షా హెచ్చరించారు. “టీఎంసీ ప్రభుత్వం చాలా స్కాంలు చేసింది. దాదాపు రూ.5వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది. భారత పార్లమెంటులో జరిగిన ప్రశ్నకు డబ్బులు స్కాంకూ టీఎంసీయే కారణం. 26వేల స్కూల్ టీచర్ల ఉద్యోగాల తొలగింపు యత్నం, రేషన్ పంపిణీ స్కాం, పశువుల స్మగ్లింగ్, స్థానిక సంస్థల్లో ఉద్యోగాల భర్తీ, ఉపాధి హామీ పథకం, పీఎం ఆవాస్ వంటి వాటిలోనూ టీఎంసీ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మేం అధికారంలోకి వచ్చాక అవినీతిపరుల నుంచి ప్రతీ రూపాయిని కక్కిస్తాం. 7వ వేతన సంఘం సిఫారసులను రాష్ట్రంలో 45 రోజుల్లోగా అమల్లోకి తెస్తాం. మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.3వేలు, గర్భిణులకు రూ.21వేలు, దివ్యాంగులకు ప్రతినెలా రూ.2వేలు ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. రాష్ట్ర బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతిని కల్పిస్తాం. ఆయుష్మాన్ భారత్ స్కీం ద్వారా రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా అందరికీ అందుబాటులోకి వస్తుంది. రైతులకు ఏటా ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ.9వేలకు పెంచుతాం. మేం అధికారంలోకి వచ్చాక బంగాల్‌లో 5 పారిశ్రామిక ఎస్టేట్‌లను నిర్మిస్తాం. తద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహానికి మార్గాన్ని సుగమం చేస్తాం” అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. “బంగాల్ సహా దేశం నుంచి చొరబాటుదారులను తరిమేయడానికే ఈ అసెంబ్లీ ఎన్నికలు. బంగాల్ నుంచి చొరబాటుదారులను తరిమేసే సత్తా మమతకు లేదా ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ఉందా? టీఎంసీ ప్రభుత్వం కనీసం దేశ సరిహద్దు కంచెకు కూడా భూమిని కేటాయించడం లేదు. కానీ బంగాల్‌లో చొరబాట్లకు బీఎస్ఎఫ్ కారణమని మమత ఆరోపిస్తున్నారు.

## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

జగ్ విక్రమ్ అనే భారత నౌక 20,400 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 14కల్లా గుజరాత్‌లోని కాండ్లాకు చేరుకుంటుందని పోర్టులు, నౌకాయానం, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని ఆయన తెలిపారు. అమెరికా - ఇరాన్ మధ్య 14 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్ మీదుగా వస్తున్న తొలి భారత నౌక ఇదేనన్నారు. గత 24 గంటల వ్యవధిలో గల్ఫ్ సముద్ర జలాల్లో భారత జెండా కలిగిన నౌకలు, భారతీయ నావికులపై ఒక్క దాడి కూడా జరగలేదని ముకేశ్ మంగళ్ చెప్పారు. సోమవారం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 2,177 మంది భారతీయ నావికుల సురక్షిత ప్రయాణానికి తమ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. గల్ఫ్‌లో గత 24 గంటల్లోనే 93 మంది భారతీయ నావికుల కోసం సురక్షిత ప్రయాణ ఏర్పాట్లు చేశామని ముకేశ్ పేర్కొన్నారు.

**ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు**

“నావికుల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇందుకోసం నిరంతరాయంగా సముద్రజలాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. భారత విదేశాంగ శాఖ, గల్ఫ్ పరిధిలోని భారతీయ మిషన్లు, సముద్ర జల రవాణాతో ముడిపడిన విభాగాలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నాం. గల్ఫ్‌లో చిక్కుకున్న అన్ని భారతీయ నౌకలను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని హర్మూజ్ దాటించి భారత్‌కు తీసుకొస్తాం. ప్రస్తుతానికి భారత్‌కు చెందిన 15 నౌకలు గల్ఫ్ సముద్ర జలాల్లో ఉన్నాయి” అని కేంద్ర నౌకాయాన శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు.

**నిరంతరాయంగా ఎల్‌పీజీ సప్లై**

**బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపు**

భారత్‌లో తగినంత ఎల్‌పీజీ స్టాక్ ఉందని, సిలిండర్ల పంపిణీ నిలకడగా జరుగుతోందని కేంద్ర పెట్రోలియం - సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. దేశ ప్రజలంతా బాధ్యతాయుతంగా ఎల్‌పీజీని వినియోగించాలని, భయాందోళనతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దని సూచించారు. ఇకపైనా ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ నిరాటంకంగా జరుగుతుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎల్‌పీజీ నిల్వలపై భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందని, దేశవ్యాప్తంగా ప్రజలకు సిలిండర్ల సప్లైలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తోందని సుజాత శర్మ చెప్పారు. దేశంలోని ఎల్‌పీజీ కస్టమర్లలో దాదాపు 99 శాతం మంది ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్, వాట్సాప్, మొబైల్ అప్లికేషన్ల వంటి డిజిటల్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలకు జనం రద్దీ తగ్గుతుందని, వేగవంతంగా సిలిండర్ల డెలివరీకి అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీల పొడిగింపు**

ఎలక్ట్రిక్ వాహనాలపై అందిస్తున్న రాయితీలను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఎలక్ట్రిక్ త్రీ వీలర్లపై అందించే సబ్సిడీకి సంబంధించిన టర్మినల్ తేదీని 2028 మార్చి వరకు పొడిగించామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. ఇక టూవీలర్లపై రాయితీ పొడిగింపు 2026 జులై వరకు అమల్లో ఉంటుందన్నారు.

**ప్రధాని ఆదేశాల మేరకు గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్ బలోపేతం**

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తాము గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగానే భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఏప్రిల్ 11, 12 తేదీల్లో యూఏఈలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పెద్దలను కలిశారని ఆయన తెలిపారు. పశ్చిమాసియా సైనిక ఘర్షణ వేళ భారతీయులకు భద్రత కల్పించినందుకు యూఏఈ పాలకులకు భారత విదేశాంగ మంత్రి ధన్యవాదాలు చెప్పారన్నారు.

## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

లతమిళనాడు ఎన్నికల్లో బరిలోకి దిగిన నటుడు విజయ్?కు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు తెలిపారు. విజయ్ సమర్థుడని, చాలా పెద్ద స్టార్? అని కొనియాడారు. అలాంటి వ్యక్తి ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. ఇటీవల 'జనసేనాని విత్ జెన్‌జీ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌కు సలహా ఇస్తారా అని అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానిమిచ్చారు. 'నేను ఎవరికీ సలహా ఇవ్వను. నా పిల్లలకు విషయంలో కూడా అంతే. ప్రతి ఒక్కరూ తమదైన మార్గంలో ముందుకు వెళ్లగలరు. ఇక విజయ్? విషయానికొస్తే ఆయన చాలా పెద్ద స్టార్. ప్రతి పౌరుడికి రాజకీయాల్లోకి రావడానికి, పార్టీ స్థాపించడానికి హక్కు ఉంది. ఆయన ఏ పాత్రలో ఉన్నా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని నేను భావిస్తున్నా' అని పవన్ కల్యాణ్ తెలిపారు. పాలిటిక్స్‌లోకి రావాలంటే ఎలాంటి త్యాగాలు చేయాల్సి వస్తుంది? అని ఓ యువకుడు అడిగిన ప్రశ్నించాడు. అందుకు త్యాగాలు చేయకూడదు అని పవన్ కల్యాణ్ బదులిచ్చారు. రాజకీయాన్ని ఎప్పుడూ వ్యాపారం కోణంలో చూడకూడదని చెప్పారు. ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉంటే ఎవరైనా రాజకీయాల్లోకి రావొచ్చని సలహా ఇచ్చారు. సరైన విధంగా వినియోగించుకుంటే సోషల్ మీడియా ఎంతో పవర్‌ఫుల్ అని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఒకవేళ మీరు కంటెంట్ క్రియేటర్ అయి ఉంటే ఎలాంటి వీడియోలు చేస్తారు అని అడగ్గా, దేశభక్తి, ప్రకృతి పరిరక్షణపై చేస్తానని చెప్పారు. జనసేన పార్టీను 2014లో స్థాపించిన పవన్ కల్యాణ్, తొలినాళ్లలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల్లో పరాజయాలు చవిచూసినా, 2024లో తెలుగుదేశం పార్టీ, బీజేపీతో కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రాజకీయంగా కీలక మైలురాయి సాధించారు.

**హోలోగ్రామ్ టెక్నాలజీతో విజయ్ పార్టీ ప్రచారం**

ఇదిలా ఉండగా, తమిళనాడులో రాజకీయ ప్రచార పద్ధతుల్లో కొత్త మార్పుకు టీవీకే శ్రీకారం చుట్టింది. విజయ్ హోలోగ్రామ్‌ను ఉపయోగించి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 12న కుంభకోణం నియోజకవర్గంలో ఈ సాంకేతికతను తొలిసారిగా వినియోగించారు. హైడెఫినిషన్ 3డీ హోలోగ్రామ్ ద్వారా విజయ్ ప్రసంగం ప్రజలకు చూపించారు. ప్రచార వాహనంపై ఈ డిజిటల్ ప్రతిరూపం ప్రత్యక్షంగా మాట్లాడుతున్నట్లుగా కనిపించడంతో ప్రజల్లో ఆసక్తి పెరిగింది. టీవీకే నాయకత్వం తెలిపిన వివరాల ప్రకారం, పార్టీ 200కు పైగా నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతానికి విజయ్ స్వయంగా వెళ్లడం సాధ్యం కాదని భావించి, హోలోగ్రామ్ టెక్నాలజీని వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ హోలోగ్రామ్ ప్రాజెక్ట్‌ను రూపొందించిన ప్రవీణ్ అనే 20 ఏళ్ల యువకుడు, ఏఐ, డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థి. అతను 50 సెకన్ల విజయ్ ప్రసంగాన్ని ఏఐ ఆధారంగా రూపొందించి, మూడు రోజుల్లో హోలోగ్రామ్‌గా మార్చినట్లు తెలిపాడు.

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

ఎన్నికల నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దొంగ ఓట్లను అరికట్టేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, ఐరిస్ బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణను చేపట్టేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేంద్రం, ఎన్నిక సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ అంశంపై విచారణ చేపట్టింది. అయితే ప్రస్తుత జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ విధానం అమలు చేయలేమని స్పష్టం చేసింది. తదుపరి పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ విధానాన్ని అమలు చేయాలా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ విధానం అమలు చేయాలంటే నిబంధనల్లో మార్పులు అవసరమవుతాయని, అలాగే ప్రభుత్వ ఖజానాపై భారీ ఆర్థిక భారం పడుతుందని తెలిపింది. ఈ అంశంపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, ఈసీతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేశారు. ఓటింగ్ ప్రక్రియలో అవినీతి, అనుచిత ప్రభావం, నకిలీ, డూప్లికేటు ఓట్లు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ప్రజల భద్రత, పర్యావరణంపై జాగ్రత్తల విషయంలో రాజీ పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

పెంచడం అనుమతుల సులభతరం చేయడం అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్ర ప్రతిపాదనలను సీఎంకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. రాష్ట్ర విధానాలను, ప్రణాళికలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామన్నారు. ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు. పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.



**వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలి**

అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సీఎం సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని ఆ సంఖ్యను 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. పారిశ్రామిక పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు.

ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ కనెక్షన్లను త్వరగా అందించాలని చెప్పారు. ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సూచించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందన్నారు.

**డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా**

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కన్నా మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ఏఐ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని

# అమరావతిలో మరో కీలక ఘట్టం

ప్రపంచ క్వాంటం డే పురస్కరించుకుని దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా రేపు(ఏప్రిల్ 14)వ తేదీన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్?లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్?ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. విజన్ నుంచి క్యూబిట్స్ వరకు ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా రేపు (ఏప్రిల్ 14)న ముఖ్యమంత్రి చంద్రబాబు ూ=వీ యూనివర్సిటీలో దేశంలోనే తొలి స్వదేశీ, ఓపెన్ యాక్సెస్ క్వాంటమ్ కంప్యూటర్లు -- చూాఝితీుఝఞఅ 1ూ ఁ 1ూ --ను ప్రారంభించనున్నారని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ స్థాయి కేంద్రంగా అవతరించబోతోందని తెలిపారు. భవిష్యత్తు ఇక్కడే ఉందన్నారు. అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం

మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్?తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్?ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది.

మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

దేశంలోనే తొలిసారిగా




అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్?లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్ ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్?ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్ ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరు కానున్నారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్ గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**తయారీ రంగంలో ముందడుగు**

అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుతో పాటు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయి క్వాంటమ్ కంప్యూటర్లను, విడిభాగాల్ని అక్కడే తయారుచేసి ఎగుమతి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. గత ఏడాది సెప్టెంబరు 9న హార్డ్‌వేర్ విడిభాగాల తయారీదారులతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశంలో క్వాంటమ్ విడిభాగాల టెస్టింగ్, వ్యాలిడేషన్, బెంచ్‌మార్కింగ్, సర్టిఫికేషన్ కోసం రిఫరెన్స్ సదుపాయాలు కావాలని వారు కోరారు. అమరావతిలో రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కల్పించాలన్న నిర్ణయం అప్పుడే జరిగింది. ఈ సదుపాయాలు రావడంతో అమరావతిలోనే క్వాంటమ్ పరికరాలు తయారుచేసేందుకు దేశంలోని పలు సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది. మన దేశంలో ప్రస్తుతం కొన్ని సంస్థలు క్వాంటమ్ విడిభాగాలు తయారుచేస్తున్నా, ప్రాసెసర్ల వంటివాటిని టెస్టింగ్ కోసం విదేశాలకు పంపాల్సి వస్తోంది. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌తో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ రంగంలో భారత్ పెద్ద ముందడుగు వేయనుంది.

**క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా**

అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ కోసం తయారు చేసిన క్రయోజెనిక్స్, ప్రిసిషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, క్వాంటమ్ గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ పరికరాలు, సదుపాయాలు కేవలం క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా, రక్షణ, ఆరోగ్య, సెమీకండక్టర్ తయారీ వంటి రంగాలకూ ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. క్రయోజెనిక్ సిస్టమ్స్‌ను ఎంఆర్ఐ మెషీన్లు, స్పేస్ అప్లికేషన్లలో వినియోగిస్తారు. ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సెన్సింగ్, రాడార్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌కు ఉపయోగపడుతుంది. క్వాంటమ్‌గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ సదుపాయాలను సెమీకండక్టర్ల తయారీ, డీప్‌టెక్ ఇండస్ట్రియల్ అప్లికేషన్లలో వినియోగిస్తారు.

# కేబినెట్‌లో లీక్ వీరులు...

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే ఒక అంశం హాట్ టాపిక్‌గా మారింది. అదే 'కేబినెట్ అజెండా లీక్'. ప్రభుత్వ నిర్ణయాలు అధికారికంగా వెలువడక ముందే బయటకు పొక్కడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ అంశంపై మంత్రులకు ఆయన క్లాస్ పీకడమే కాకుండా, సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సాధారణంగా కేబినెట్ సమావేశం అంటే అత్యంత గోప్యంగా జరిగే ప్రక్రియ. అందులో చర్చించే అంశాలు, తీసుకోబోయే నిర్ణయాలు సమావేశం ముగిసిన తర్వాత మీడియాకు వెల్లడిస్తారు. కానీ, గత కొంతకాలంగా ఏపీలో కేబినెట్ భేటీ కంటే ముందే అజెండాలోని అంశాలు మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. దీనిపై చంద్రబాబు గుర్రుగా ఉన్నారు.ప్రభుత్వంలోని అత్యున్నత నిర్ణాయక మండలి నిర్ణయాలు ఇలా వీధికెక్కడం ఏంటని సీఎం మంత్రులను సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కీలక సమాచారం బయటకు వెళ్లడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, కొన్ని నిర్ణయాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు గత చరిత్రను గుర్తు చేస్తూ మంత్రులను హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ తీసుకున్న సంచలన నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో కేబినెట్ అజెండా లీక్ అయినప్పుడు, క్రమశిక్షణ విషయంలో రాజీ పడని ఎన్టీఆర్ ఏకంగా తన పూర్తి మంత్రిమండలిని రద్దు చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. ఇకపై అజెండా లీక్ అయితే దానికి సంబంధిత శాఖా మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.ప్రభుత్వ సమాచారం లీక్ అవ్వడం వెనుక రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి. తాము చేస్తున్న పనులు లేదా తీసుకోబోయే నిర్ణయాలను ముందే లీక్ చేయడం ద్వారా క్రెడిట్ కొట్టేయాలని కొందరు మంత్రులు లేదా వారి అనుచరులు ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానం ఉంది. మంత్రుల కార్యాలయాల్లోని పీఎస్ లు లేదా ఇతర సిబ్బంది ద్వారా మీడియాకు సమాచారం చేరుతోందా? అనే కోణంలోనూ చర్చ జరుగుతోంది. భూముల కేటాయింపు లేదా కొత్త పథకాలకు సంబంధించిన నిర్ణయాలు ముందే లీక్ అయితే మార్కెట్ శక్తులు వాటిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కేబినెట్ గోప్యతను కాపాడలేకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న పట్టు సడలుతుందనే భావన ఏర్పడుతుంది.చంద్రబాబు కేవలం హెచ్చరికతోనే ఆగిపోకుండా, నిఘా పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. "గతంలో లీకులు జరిగాయి.. ఇకపై అవి పునరావృతం కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఉదంతాన్ని గుర్తు చేయడం ద్వారా, తాను కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోననే సంకేతాన్ని తన కేబినెట్ సహచరులకు పంపారు.

## ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం అమరావతి

-మొదటిపేజీ తరువాయి

తరఫున ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర--సంస్కృతి--రాజధానిలో పూర్తయిన నిర్మాణాలు, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్ ప్రకారం మొత్తం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే ఊహాచిత్రాలు, పర్యావరణహిత నిర్మాణ విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమరావతి కి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ, 2024 లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించింది ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్రపతికి వివరించారు. రాజధాని ఏర్పాటు కోసం చంద్రబాబు గారి పిలుపుతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూములు రైతులు త్యాగం చేశారని, గత పాలనలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు పెట్టినా, శాంతియుతంగా రాజధాని కోసం ఉద్యమించారని రాష్ట్రపతికి లోకేష్ వివరించారు. కోట్లాది ప్రజల కోరిక అయిన అమరావతి చట్టం తన హయాంలో రూపొందడం సంతోషంగా ఉందని, రైతులు రాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణం కోసం తమ భూమిని ఇచ్చారని రాష్ట్రపతి రైతుల త్యాగాలను కొనియాడారు. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని ఆయన దూరదష్టితో రాష్ట్రాన్ని, రాజధాని అద్భుతంగా అభివద్ధి చేస్తారని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

## కొత్తగా మరో 62 అన్న క్యాంటీన్లు

-మొదటిపేజీ తరువాయి

పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు. .**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 2.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

## రాజ్యసభ రేసు

## భారీగా పెరుగుతున్న ఆశావహులు


**విజయవాడ :** తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారాల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు , కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమ కూడా రేసులో ఉన్నారు. యువనేతలు వంగవీటి రాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ , కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉన్నందున అభ్యర్థుల ఎంపికను చంద్రబాబు ఫైనల్ చేస్తున్నారు.

## 14 నుంచి 21 చిత్తూరు జిల్లాల్లో నియోజకవర్గాలు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోబోతోంది. ప్రస్తుతం ఉన్న 14 అసెంబ్లీ స్థానాల సంఖ్య ఏకంగా 21కి పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లోనూ, అభ్యర్థుల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2004 వరకు ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండేవి. 2009 పునర్విభజనలో వాయల్పాడు, పుత్తూరు, వేపంజేరి నియోజకవర్గాలు రద్దు కాగా.. కొత్తగా గంగాధర నెల్లూరు, పూతలపట్టు ఏర్పడ్డాయి. దీంతో సీట్ల సంఖ్య 14కి తగ్గింది. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం ఈ సంఖ్య 21కి చేరనుండటం విశేషం.రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిన తిరుపతిలో జనాభా ప్రాతిపదికన భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో భాగంగా ఉన్న తిరుపతి రూరల్ మండలాన్ని విడదీసి కొత్త నియోజకవర్గంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో రామచంద్రపురం మండలాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో రేణిగుంట కేంద్రంగా కొత్త సీటు ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. గతంలో రద్దయిన పుత్తూరు నియోజకవర్గం మళ్ళీ తెరపైకి రానుంది.

# ఉమ్మడి జిల్లాలో పర్యావరణ నిబంధనల అమలుపై నిర్లక్ష్యం






-- తక్షణ చర్యలు కోరిన ఎన్‌హెచ్ఆర్‌సిఎన్‌డీటి ట్రస్ట్

**పుట్టపర్తి: ప్రజా జ్యోతి న్యూస్: ఏప్రిల్ 13: అంజి:** శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు మరియు గనుల ప్రాంతాల్లో పర్యావరణ నిబంధనలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఎన్‌హెచ్ఆర్‌సిఎన్‌డీటి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు పరిశ్రమలు తప్పనిసరిగా అమలు చేయాల్సిన 33 శాతం గ్రీన్ బెల్ట్ మొక్కల పెంపకం కార్యక్రమం సరిగా చేపట్టకపోవడం వల్ల కాలుష్యం పెరిగి ప్రాంతీయ పర్యావరణానికి దీర్ఘకాలిక నష్టం కలుగుతోందని వారు పేర్కొన్నారు అదేవిధంగా గనుల తవ్వకాల ప్రాంతాల్లో బఫర్ జోన్ ప్లాంటేషన్ గ్రామీణ రహదారుల వెంట మొక్కల పెంపకం వంటి ముఖ్యమైన నిబంధనలు పాటించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు పర్యావరణ పరిరక్షణ కోసం వినియోగించాల్సిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీ ఎస్ ఆర్ నిధులు కూడా సరైన విధంగా వినియోగించడంలేదని ట్రస్ట్ సభ్యులు ఆరోపించారు నిబంధనలు పాటించని కొన్ని పరిశ్రమలు మరియు గనులకు పునరుద్ధరణ రెన్యువల్స్ ఇవ్వడం కూడా ప్రశ్నార్థకమని అభిప్రాయపడ్డారు ఇప్పటికైనా జిల్లా పరిపాలన స్పందించి స్వచ్ఛంద సంస్థల సహకారంతో భారీ స్థాయిలో మొక్కల పెంపకం కార్యక్రమాలు చేపట్టి కనీసం నాలుగేళ్లపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు ఇప్పటికే అనేక సంవత్సరాలుగా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ట్రస్ట్ అధినేత భాస్కర్ నాయుడు తెలిపారు ఈసారి కూడా స్పందించకపోతే చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలియజేశారు ఈ విషయంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో విజ్ఞప్తి చేయడం జరిగింది అనీ ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి భాస్కర్ నాయుడు తెలియజేశారు

## మాజీ సైనికులకు ఘన సన్మానం.



**ప్రజా జ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. పాతపట్నం** శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం పెద్దసీది. దేశానికి విశిష్ట సేవలు అందించి ఇటీవల పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం లోని పెద్దసీధి గ్రామంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నాల పాపారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా టంకాల రామారావు హాజరై కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సైనికులు సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, సుబేదార్ కడుసు వెంకటరావు, సుబేదార్ సిరినిల్ల ఉపేంద్ర, హావల్దార్ గోరిబంద ప్రసాదరావులను ఘనంగా సత్కరించారు. వీరిని శాలువాలతో సన్మానించి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. గ్రామ ప్రజలు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని మాజీ సైనికులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బోను రమణమూర్తి, బావారాలాల్ కిరణ్, లింగిబుక్తా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆజాద్ అసోసియేషన్ సభ్యులు సహకరించారు.

## బీచ్ అభివృద్ధిపై కలెక్టర్ ఫోకస్ టోల్ వసూళ్లపై హెచ్చరిక

**ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీ చేయాలని ఆదేశం**



**బాపట్ల ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సూర్యలంక బీచ్ వద్ద జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఆదేశించారు. సోమవారం బీచ్ ప్రాంతాన్ని ఆయన ప్రత్యక్షంగా సందర్శించి, పర్యాటక శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఆర్డీఓ పి. గ్లోరియ, జిల్లా అటవీశాఖ అధికారి రవిశంకర్ తదితరులతో కలిసి భూముల స్థితిగతులను పరిశీలించిన కలెక్టర్‌కు మండల సర్వే అధికారులు మ్యాప్‌ల ద్వారా వివరాలు అందించారు. ప్రభుత్వ భూములను రక్షించేందుకు ఖాళీ ప్రదేశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. అలాగే, సర్వే నంబర్లలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలను గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాలని ఆర్డీవో, తహసీల్దార్‌లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సూర్యలంక బీచ్ వద్ద అనధికారికంగా టోల్ గేట్లు ఏర్పాటు చేసి వసూళ్లు చేస్తే సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా అక్రమంగా వసూళ్లు చేస్తున్న షేడ్‌ను అధికారుల సమక్షంలో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్, సర్వే శాఖ ఏడీ సాంబశివరావు, తహసీల్దార్ షేక్ సలీమా, అల్తాఫ్, పర్యాటక, అటవీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధర్మదీక్షకు మద్దతు తెలిపిన అఖిల

**భారత యాదవ మహా సంఘం**



**ప్రజా జ్యోతి న్యూస్, చెన్నూరు, ఏప్రిల్13** బీసీల హక్కుల కోసం ధర్మదీక్ష చేస్తున్న మంగళగిరి లో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ధర్మదీక్షకు కడప జిల్లా యాదవ్ మహా సంఘం నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలని ఈ సందర్భంగా యాదవ్ సంగం నాయకులు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం రాజధాని ప్రాంతంలో 1000ఎకరాలు భూమి కేటాయించాలని, బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ,విద్య వైద్య ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు సమగ్ర సర్వే నిర్వహించి బీసీల కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని ఆయన చేసిన దీక్షకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లు అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు, ఈ దీక్షకు మద్దతుగా రాష్ట్రంలో బీసీలందరూ మద్దతు తెలియజేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగ యాదవ్, జిల్లా అధ్యక్షులు కావేటి ప్రతాప్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ల చెన్నయ్య యాదవ్, కొప్పుల ఓబులేష్ యాదవ్, ప్రతాప్ యాదవ్, సుధాకర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ముఖ్య నాయకులు ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

-----హొళగుంద మండల సహకార బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

హెబ్బటం గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

భక్తులకు అసౌకర్యం కలగకుండా వి.వి.ఆర్ టీం చర్యలు





**హొళగుంద,ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి న్యూస్ –** హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో వెలసిన శ్రీ శక్తి సవరమ్మ దేవి, శ్రీ సుంకలమ్మ దేవి అమ్మవార్ల కుంభోత్సవం సందర్భంగా గ్రామంలో అభివృద్ధి మరియు పారిశుద్ధ్య పనులు శరవేగంగా చేపడుతున్నట్లు వి.వి.ఆర్ టీం సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో గ్రామంలో జరగనున్న అమ్మవార్ల కుంభోత్సవ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, వైకుంఠం శివ ప్రసాద్ గారి ఆదేశాల మేరకు, హొళగుంద మండల సహకార బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పనులను పర్యవేక్షిస్తున్నట్లు వి.వి.ఆర్ టీం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా 20 లక్షల వ్యయంతో నూతనంగా సిసి రోడ్లు మరియు గ్రావెల్ రోడ్ల నిర్మాణం పనులు గుమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, త్రాగునీటి సౌకర్యం మరియు వీధి లైట్ల వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటును ముమ్మరం చేసామన్నారు. ఉత్సవాల కు వచ్చే భక్తులకు మరియు గ్రామ ప్రజలకు ఎటువంటి అసౌక ర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను చేపడతామన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవతల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు వ్యవసాయ కమిటీ డైరెక్టర్ గోపాల్, యూనిట్ ఇంచార్జ్ సవారప్ప, క్లస్టర్ ఇంచార్జ్ మల్లికార్జున, బూత్ ఇంచార్జ్ శేక్షవలి, గ్రామ అధ్యక్షులు పాటయ్య, ఉపాధ్యక్షులు నాగయ్య, మరియు సభ్యులు శేఖర్, మాణిక్య, కాళప్ప, కృష్ణ, శీను తదితరులు పాల్గొన్నారు.

## మెలియాపుట్టి తవ్వకాలలో వెలసిన అయ్యప్ప స్వామి విగ్రహం



**మెలియాపుట్టి (ప్రతినిది ) ప్రజా జ్యోతి ఏప్రిల్ 13** స్థానిక మెలియాపుట్టి మండల కేంద్రంలో తవ్వకాలలో సాయిరాం మందిరంకు తూర్పున కు శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి విగ్రహం వెలిసింది. అక్కడ విచ్చేసిన మేకల కాపరి మేకలు తోలుకుంటూ ఇద్దరు పిల్లలు అక్కడకు వచ్చి అక్కడ ఏదో ఉంది అని ఒకరి కొకరు మాట్లాడుకుంటూ అక్కడ ఒక చెయ్యి లాంటిది మీదకు రావడంతో ఒకరి కొకరు ఆ మట్టి తీయడంతో అక్కడ ఒక బొమ్మలాగ కనిపించింది. ఇద్దరు పిల్లలు భయంతో వాళ్ళ తల్లిదండ్రులకు పిలవడానికి వెళ్లారు. వాళ్ల తల్లిదండ్రులు కూడా ఆ స్థలానికి చేరుకున్న తర్వాత ఆ విగ్రహానికి బయటికి తీసి,నీళ్లతో కడుగగా, ఆ విగ్రహం మెరుస్తూ సాక్షాత్తూ శబరిమల అయ్యప్ప స్వామి చూసినట్టుగా ఉండడంతో అక్కడికి చేరిన భక్తులు, అలాగే గ్రామ ప్రజలు, బయట గ్రామం నుంచి వచ్చిన భక్తులు తండోప తండలుగా అక్కడికి చేరి శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారిని తిలకించి ఆశీర్వాదం పొందుతున్నారు.

## కార్యకర్తే అధినేత.



**ప్రజా జ్యోతి రిపోర్టర్ :-యం.నరేష్.**పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో కార్యకర్తే అధినేత కార్యక్రంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ కార్యకర్తే అధినేత అన్న మాటను ఆచరణలో పెడుతున్న ఎమ్మెల్యే ఎంజీఆర్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం. తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మై టి.డి.పి యాప్ ఇన్స్టాల్ చేసుకుని పార్టీ ఇచ్చిన టాస్కులను మరియు నియోజకవర్గంలో చేసిన కార్యకలాపాలను యాప్ లో అప్లోడ్ చేయాలి క్యాడర్ కు దిశనిర్దేశం చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం సోమవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులు వారి కార్యాలయం నందు కార్యకర్తే అధినేత సమావేశం కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు గారు నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెట్టింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం అని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని, వారి యొక్క సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని అన్నారు. ఈ సమావేశంలో మండలాల ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాంచో ఫెర్రర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తలారి రంగయ్య, వై. విశ్వేశ్వరరెడ్డి



**ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు:-** రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. గతంలో ఆర్డీటీ సంస్థకు సంబంధించి నిలిచిపోయిన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కోసం తలారి రంగయ్య, వై. విశ్వేశ్వరరెడ్డి విశేష కృషి చేశారు. ఈ క్రమంలో సంస్థకు ఎదురైన సాంకేతిక ఇబ్బందులను తొలగించి, రెన్యూవల్ అయ్యేలా వారు చేసిన పోరాటాన్ని మాంచో ఫెర్రర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జిల్లాలో ఆర్డీటీ సాగిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## చేయి చేయి కలిపిన రైతన్నలు.... రహదారికి కొత్త రూపు

**రోడ్డు మరమ్మతుకు నడుం బిగించిన రైతులు,దాతలు**





**హోళగుంద, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద నుండి నాగరకన్వి మరియు హెన్నూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో రైతులు, స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులకు పూనుకున్నారు. సోమవారం రైతులందరూ ఏకమై 'శ్రమదానం' చేపట్టారు. ఇందులో భాగంగా మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు హెచ్. శివన్న గౌడ్ తన వంతు సహకారంగా 5 ట్రాక్టర్లను రోడ్డు మరమ్మతుల కోసం కేటాయించారు. అదేవిధంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఈ.గోవింద గౌడ్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.రైతు సజ్జ సత్యనారాయణ రాజు రోడ్డు చదును చేసేందుకు అవసరమైన మట్టిని ఉచితంగా అందజేశారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో రైతులు చందాలు, విరాళాలు పోగు చేసుకుని, మొత్తం 10 ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తోలి, రోడ్డును చదును చేశారు. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలనీ,కనీసం తాత్కాలికంగానైనా ఎర్రమట్టి వేసి రోడ్డును బాగు చేయాలనీ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు హెచ్. శివశంకర గౌడ, ఎల్లప్ప, గాదెప్ప, సిద్ధప్ప, బసవరాజ్, గాదిలింగ, లింగన్న, రామయ్య, అంజి, వీరేష్, కృష్ణయ్య తదితర రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఐసిడిఎస్ సిడిపివో పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ

**కాకినాడ జిల్లా ఏప్రిల్ 13( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రత్తిపాడు సెక్టార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 23 తేదీ వరకూ ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.5వ రోజు కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు గ్రామంలో అంగన్వాడీ సెంటర్ నందు నిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు 2 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని



కోరారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు.మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, సూపర్వైజర్ ఎన్ వరలక్ష్మి,ఎంపీపీ స్కూల్ హెడ్ మాస్టర్ పాపయ్య,ఐసిడిఎస్ టీచర్లు,హెల్పర్లు,పలువురు గర్భిణీలు బాలింతలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆర్డీవోకి అఖిల భారత రైతు కూలీ సంఘం వినతి

**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):**అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం కిల భారత రైతు కూలీ సంఘం గుంతకల్లు డివిజన్ కమిటీ సభ్యులు రామాంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక కసాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు వంద మందితో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినేత పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రామాంజనేయులు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వలేదని కావున కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం, ఇల్లు లేని నిరుపేద లకు న్యాయం చేయాలని, గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని గతంలో మేము గుత్తి తాసిల్దార్ కి, చాలాసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ ఆన్లైన్లో ఎక్కించలేదు వెబ్సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. వీఆర్వోలు, ఆర్ ఐ లు, డిప్యూటీ తాసిల్దార్ అధికారులందరూ సరైన సమాధానం చెప్పలేదని సోమవారం గుంతకల్లు డివిజన





ల్ ఆర్డిఓ కి మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎవరైతే ఇంటి స్థలాల కోసం అర్జీలు చేసుకున్నారో సంబం ధిత అధికారులు అర్జీలను ఆన్లైన్లో నమోదు చేసి ఉంటా రని సంబం ధిత అధికారులను కలవాలని ఆర్డీవో తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు స్థలాలు కచ్చితంగా ఇస్తామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం కసాపురం కమిటీ సభ్యులు జక్కన్న, మహిళా సంఘం నాయకురాలు కళావతి, మహాలక్ష్మి, లక్ష్మి గుత్తి కమిటీ సభ్యులు నజీర్,ధనుంజయ, సువర్ణ, పద్మావతి, అరుణోద య సంస్కృతిక సమైక్య సభ్యుడు గంగాధర, ఎర్రి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 18,19 తేదీల్లో గుంతకల్లు లో జరుగు ఏఐటియుసి జిల్లా 12 వ మహాసభలు జయప్రదం చేయండి

**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):** కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైకరి మార్చుకోవా లని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటియుసి అనంత పురము జిల్లా 12 వ మహాస భలు ఈనెల ఏప్రిల్ 18,19 తేదీల్లో గుంతకల్లు లో నిర్వహి స్తున్న సందర్భంగా సోమవా రం బిటి పక్కిరప్ప భవన్ నందు రాజారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడు తూ కార్మికుల హక్కులుగా భావిం చే కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూల మైన లేబర్ కోడ్స్ తీసుకొచ్చా యన్నారు. వంద సంవత్సరా లు క్రితమే పోరాడి సాధించు కున్న 44 కార్మిక చట్టాలను రూపుమాపడాన్ని ఏఐటియు సి గా వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహ రించడం సరికాదన్నారు, వామపక్ష పోరాటాలు దెబ్బ తీయడం ఎవరితరం కాదన్నా రు. కనీస వేతనాలు 26000 ఇవ్వాలన్నారు, హమాలీ ఆటో వీధివిక్రయ దారులకు ప్రత్యేక సంక్షేమ చట్టం చేయా లన్నారు, ఔట్సోర్సిం




గ్ కాంట్రా క్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సంఘటిత,అసంఘటిత కార్మికుల సమస్యలపై ఈనెల 18,19 న గుంతకల్లులో జరిగే ఏఐటి యుసి 12 వ జిల్లా మహాస భల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. ఈ మహాసభల జయప్ర దానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి గౌస్, గుంతకల్లు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి సురేష్, ఈశ్వరయ్య, నాయకు లు మల్లయ్య, మిల్ రామాంజ నేయులు కత్తి సేన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ప్రజా దర్బార్

**ప్రజా జ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.పాతపట్నం** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే "ప్రజా దర్బార్"ఎమ్మెల్యే ఎంజీఆర్ వీలున్నంత వేగంగా సమస్యలను పరిష్కరించాలని అధికారుల కు ఆదేశించిన ఎమ్మెల్యే పాతపట్నం నియోజకవర్గం కేంద్రం లోని తన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ప్రజాదర్బార్ నిర్వహించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఈ దర్బార్ కు సంబందించి 35 రెవెన్యూ,సీఎంఆర్ఎఫ్ పెన్షన్, త్రాగునీరు, రహదారులు తదితర సమస్యలపై ప్రజలు నుంచి నేరుగా వినతులు స్వీకరించి తక్షణ మే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు అదేవిధంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఇక మీదట తరచూ "ప్రజా దర్బార్" లను నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.



## పిజిఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, ఏప్రిల్ 13 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** – అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, అఖిల, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 587 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ ఉంచకుండా గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డిటిసి వీర్రాజు, డిఆర్డిఏ పిడి శైలజ, మెప్మా పిడి విశ్వజ్యోతి, హౌసింగ్ పిడి శైలజ, ఐసీడీఎస్ పిడి శ్రీదేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దారును సన్మానించిన నాయకులు



**హోళగుంద, ఏప్రిల్ 13,ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద మండల నూతన తహసిల్దారుగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన తహసిల్దారు ఎం.లక్ష్మి రాజు ను టీడీపీ యువ నాయకులు పెద్దహ్యాట మల్లికార్జున,బి.కె.వీరేష్,కురువ సంఘం నాయకుడు మల్లయ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దారును శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.మండల అభివృద్ధిలోనూ, ప్రజల సమస్యల పరిష్కారంలోనూ నూతన తహసిల్దార్ చొరవ చూపాలని నాయకులు ఈ సందర్భంగా వారు కోరారు.

## మెలియాపుట్టి మండలంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరణ..



**మెలియాపుట్టి (ప్రతినిది ) ప్రజా జ్యోతి ఏప్రిల్ 13** శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం సర్పంచ్ పాలన ముగిసి ప్రత్యేక అధికారి పాలన ప్రారంభమైన నేపథ్యంలో మెలియాపుట్టి మండలంలోని పలు గ్రామ పంచాయతీలను ప్రత్యేక అధికారి కింజరాపు గణేష్ (ఏఈ, హౌసింగ్) సోమవారం సందర్శించారు.వసుంధర, నడసంద్ర, మారేడుకోట, రట్టిని పంచాయతీల పరిధిలోని మౌలిక వసతులను పరిశీలించిన ఆయన, గ్రామాల్లో పారిశుద్ధ్యం మరియు త్రాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు.గ్రామ పంచాయతీలో నిర్వహించిన సమీక్షలలో పంచాయతీ కార్యదర్శులతో చర్చించి, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రట్టిని పంచాయతీ కార్యదర్శి సుహాసిని మహాపాత్రో, నడసంద్ర పంచాయతీ కార్యదర్శి కోన వాసుదేవరావు పాల్గొన్నారు. అలాగే కూటమి భాగస్వామిగా జనసేన నాయకుడు, పాతపట్నం ఏఎంసీ డైరెక్టర్ చింతల ప్రశాంత్ కూడా హాజరయ్యారు. మెలియాపుట్టి మండలం లో ప్రత్యేక అధికారి కింజరాపు గణేష్ గ్రామాల సందర్శన చేశారు.

## గొంతెండుతోంది.....దాహం తీర్చండి మహాప్రభో....!

నీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

**హోళగుంద, ఏప్రిల్ 13,ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద మండల కేంద్రంలోని స్థానిక 8వ వార్డు ప్రజలు తాగునీటి సమస్యపై సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ తమ కాలనీలో కొళాయిలకు 15 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.15 రోజులకు ఒకసారి వచ్చే తాగునీరు దుర్వాసన వస్తోందని మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి దాపురించిందని తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహిళలు,కాలనీవాసులు పాల్గొన్నారు.



# ఎండాకాలంలో త్రాగునీటి కొరత లేకుండా చర్యలు

**సజావుగా సర్వ సభ్య సమావేశం**




**హోళగుంద,ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి న్యూస్ -** మండలంలో ఎండాకాలం ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ నూర్జహాన్, ఎంపీడీవో విజయ లలిత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీవో విజయలలితతో కలిసి ఆమె పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నూర్జహాన్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బోర్లు, హ్యాండ్‌పంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తరచూ పరిశీలించడంతో పాటు, ఎక్కడైనా లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలకు నీటి కొరత కలగకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం అధికారుల ప్రధాన బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. అలాగే నీటి మట్టం తగ్గుతున్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా చేయాలని సూచించారు. ముఖ్యంగా దూరప్రాంత గ్రామాలు, పల్లెలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో విజయలలిత మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లో త్రాగునీటి పరిస్థితిపై నిరంతరం మానిటరింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల వారీగా నివేదికలు సేకరిస్తూ, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అవసరమైన చోట్ల ట్యాంకర్లు సిద్ధంగా ఉంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో అధికారులు నీటి వనరుల సంరక్షణపై కూడా చర్చించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి వినియోగంపై నియంత్రణ పాటించడం ద్వారా సమస్యలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. మండలంలోని ప్రజలు ఎలాంటి త్రాగునీటి సమస్యలు ఎదురైనా వెంటనే గ్రామ సిబ్బంది లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, అధికారులు వెంటనే స్పందిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్ నీలా, హౌసింగ్ ఏఈ గోపీనాథ్ వర్మ, వైస్ ఎంపీపీ సింధువాళం గాదేమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# హెల్మెట్ పై కఠిన చర్యలు మొదలు

**- జిల్లా ఎస్పీ**




**బాపట్ల ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాలలో ప్రాణనష్టాన్ని తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల ని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. శిరోరక్ష. ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం రేపల్లె పట్టణంలో 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ హెల్మెట్ అవగాహన ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అంకమ్మ చెట్టు సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ రింగ్ రోడ్, అన్నా క్యాంటీన్, సోనోవిజన్, రాజ్యలక్ష్మి థియేటర్, నెహ్రూ విగ్రహం, తాలూకా సెంటర్ మీదుగా రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని సిబ్బందికి మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్‌లు జరిమానాలు విధిస్తారనే భయంతో కాకుండా, మీ కోసం ఎదురుచూసే మీ కుటుంబం కోసం హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 30 నుండి 35 శాతం ద్విచక్ర వాహనదారులేనని, వీరిలో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమన్నారు. ప్రమాద సమయంలో తలకు తగిలే గాయాల వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుండి తప్పించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారిలో 37 శాతం, 2025-26లో 32 శాతం మంది ద్విచక్ర వాహనదారులేనని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లావ్యాప్తంగా హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏప్రిల్ 1 నుండి ఇప్పటివరకు 50 ద్విచక్ర వాహన ర్యాలీలు, 159 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 15 వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని, ఏప్రిల్ 16 నుండి హెల్మెట్ ధరించని వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నో హెల్మెట్, నో ఫ్యూయల్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ ధరించిన వారికి మాత్రమే ఇంధనం అందించాలనే నిబంధనను తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ముందుగా హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. చిన్న దూరం అయినా నిర్లక్ష్యం చేయకుండా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. లక్షల రూపాయలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసే వారు, రూ.1000 నుంచి రూ.1500 విలువైన హెల్మెట్‌ను నిర్లక్ష్యం చేయడం ప్రాణాలతో చెలగాటం ఆడటమేనన్నారు. యువత, విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, రేపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు మరియు 120 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఏ ఒక్క పేదవాడికి ప్రభుత్వ విద్య దూరం కాకూడదన్నే కూటమి లక్ష్యం
- ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్







**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్ :**కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ అన్నారు. ఆముదాలవలస నియోజకవర్గంలో పొందూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల పెంపు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న నూతన విద్యా విధానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వయంగా విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో ఉన్నత విద్య, ఉన్నత ప్రమాణాలు అనే నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పలు సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఆధునిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత బోధన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం ,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సమానంగా విద్యా నాణ్యత పెరిగిందని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంపొందించడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,కూటమి ముఖ్య నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి యోజన పథకం కింద పి.టి.జీలకు 864. ఇల్లులు మంజూరు కాగా232. ఇళ్ల నిర్మాణాలు పూర్తి. అనంతగిరి మండల హౌసింగ్ ఏ.ఇ. నాగేశ్వరరావు వెల్లడి.



**అనంతగిరి మండలం. ఏప్రిల్ 13. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామ రాజు జిల్లా. అనంతగిరి మండలం 24.గ్రామ పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుపేద పి.టి. జి కులస్తులకు పీ.ఎం యోజన పథకం కింద 864. పక్క గృహాలు మంజూరు కాగా 232. గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని అనంతగిరి మండల హౌసింగ్ ఏ.ఇ నాగేశ్వరరావు సోమవారం నాడు హౌసింగ్ కార్యాలయంలో ప్రజా జ్యోతి దినపత్రికకు వివరాలు అందించారు. మిగిలిన కొన్ని గృహాలు నిర్మాణాల దశలో ఉన్నాయని త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని.గృహాల లబ్ధిదారులు అశ్రద్ధ వహించకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇల్లు మంజూరు కోరుతూ దరఖాస్తులు కోరుతున్న నేపథ్యంలో అనంతగిరి హౌసింగ్ కార్యాలయానికి లబ్ధిదారులు విచ్చేసి పూర్తి సమాచారం అందించాలని కోరారు.

## నేడు గుంతకల్లులో అంబేద్కర్ జయంతి భారీ బైక్ ర్యాలీ

**అంబేద్కర్ ఆశయ వాదులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు**




**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి ని పురస్కరించుకుని ఏప్రిల్ 14 నేడు మంగళవారం గుంతకల్లు పట్టణంలో సాయంకాలం నాలుగు గంటలకు స్థానిక హనుమాన్ సర్కిల్ నుండి పాత గుంతకల్, 60 అడుగుల రోడ్డు, పాత గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ వరకు బృహత్తర భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం సామాజిక సమరసత, సమనత్వం మరియు అంబేద్కర్ ఆశయాల ప్రచారం కోసం నిర్వహించడం జరుగుతోంది. కావున పట్టణంలోని, పల్లెల్లో ని బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు, అంబేద్కర్ ఆశయ మహిళా సంఘాలు, అంబేద్కర్ ఆశయ వాదులు మరియు రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ బైక్ ర్యాలీలో పాల్గొనాలని, ఈ ర్యాలీలలో "జై భీమ్", "జై భారత్" అనే నినాదాలతో ఉత్సాహంగా పాల్గొని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం కు నివాళులర్పించడం జరుగుతుందని బైక్ ర్యాలీ నిర్వాహకులు తెలిపారు.

## పడకేసిన పారిశుధ్యం పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని గ్రామస్థుల విన్నపం



**తాళ్లపూడి, ఏప్రియల్13, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం లోని సెయింట్ లూథరన్ చర్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో గ్రామంలో ఉన్న చెత్త మరియు వ్యర్థ పదార్థాలను డంపింగ్ చేయడం కారణంగా ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చర్చికి వెళ్లే క్రైస్తవ విశ్వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతమంతా చెత్తా చెదారంతో నిండిపోవడం కారణంగా అనారోగ్యక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అంతేకాకుండా గ్రామంలోని కొందరు రోడ్డుకి ఇరువైపులా బహిర్భూమి కి వెళ్లడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతొందని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను అంతేకాకుండా రోడ్డు పక్కన చెత్తను తగలబెట్టడంతో దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులకు దారి కనపడక ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికైనా వేగేశ్వరపురం పంచాయితీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించవలసిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు

## తహాశీల్దార్ గా ఎం.లక్ష్మీ రాజు బాధ్యతల స్వీకారం



**హొళగుంద, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి న్యూస్ -** హొళగుంద మండల తహాశీల్దార్ గా ఎం.లక్ష్మి రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్చార్జ్ తహాశీల్దార్ గా విధులు నిర్వహించిన నిజాముద్దీన్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన తహాశీల్దార్ కు రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహాశీల్దారు లక్ష్మీ రాజు మాట్లాడుతూ మండల అభివృద్ధికి,ప్రజలు,రైతుల భూ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## నిచ్చితర్థంకు హాజరైన యువ నేత సిబి. మంజునాథ్ రెడ్డి



**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని నల్లదాసరి పల్లి గ్రామంకు చెందిన వైస్సార్సీపీ నాయకులు జయరామ్ ఆహ్వానం మేరకు వారి కుమార్తె జ్యోతి డ శ్రీనాథ్ నిచ్చితర్థంకు వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం యువ నేత సిబి.మంజునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. ఈ వివాహ వేడుకలో వైస్సార్సీపీ నాయకులు తిరుపతియ్య, బాలకృష్ణ,బైపు వెంకటేష్,మల్లికార్జున, బండయ్య, చెన్నకేశవలు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సంజామల నూతన తహసీల్దార్ కు సన్మానం

ఘనంగా సన్మానం చేసిన మీడియా మిత్రులు



**బనగానపల్లె ఎప్రిల్ = 13 ప్రజాజ్యోతి ప్రతినిది** సంజామల మండలం నూతన తహసీల్దార్ గా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెలుగోడు మండలం డిప్యూటీ తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతిలో భాగంగా సంజామల తహసీల్దార్ గా పదోన్నతి లభించింది.ఈ మేరకు సంజామల తాసిల్దార్ చంద్రశేఖర్ గా బాధ్యతలును స్వీకరించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మండల కన్వీనర్ మరియు సాక్షి రిపోటర్ా ఖాసీం, సూర్య రిపోటర్ నాగేంద్ర, గణేష్ పత్రిక రిపోటర్ మహమ్మద్ రఫీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు.

## జువ్వలదిన్నె అభివృద్ధిపై వైసీపీకి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రశ్నలు

మారిటైం షిప్ యార్డ్ ప్రాజెక్ట్ రాష్ట్రానికి గర్వకారణం -- ఉపాధి అవకాశాలు పెరుగుతాయి



**బాపట్ల ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జువ్వలదిన్నెలో ఏర్పాటు కాబోతున్న ఆటోనమస్ మారిటైం షిప్ యార్డ్ మరియు సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ రాష్ట్రానికి గర్వకారణమని, గతంలో ఈ ప్రాంత అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు విమర్శించారు. జువ్వలదిన్నె పర్యటనకు వస్తున్న వైసీపీ నాయకత్వాన్ని ఉద్దేశించి ఆయన ప్రకటన విడుదల చేశారు.జువ్వలదిన్నె హార్బర్, రామాయ పట్నం పోర్టుల నిర్మాణం గతంలో జీవోల కారణంగా నిలిచిపోయిందని, అనంతరం టీడీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి అభివృద్ధికి దారులు తీర్చిదిద్దిందని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం కలిపి గణనీయమైన నిధులు వెచ్చించిందని గుర్తు చేశారు.గత ఐదేళ్లలో పనులు వేగవంతం కాలేదని, హార్బర్ నిర్మాణం ఆలస్యం కావడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తి చేసి మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి కట్టుబడి ఉందని చెప్పారు. జువ్వలదిన్నెలో రానున్న కొత్త ప్రాజెక్ట్ ద్వారా సుమారు వెయ్యి మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మత్స్యకారుల సంక్షేమం విషయంలో రాజీ పడకుండా పనిచేస్తామని, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాలతో వైటి చెరువు తూము ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేసిన గుమ్మనూరు నారాయణ స్వామి



**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని వైటి చెరువు తూము ద్వారా నీటిని పంట పొలాలకు గుంతకల్లు మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి సోమవారం విడుదల చేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ వైటి చెరువు దిగువ భాగంలో వేల ఎకరాల్లో కూరగాయల పంటలు, ముఖ్యంగా వరి సాగు జరుగుతోంది. వేసవి కాలంలో నీటి కొరత కారణంగా పంట లు దెబ్బతినకుండా ఉండేం దుకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఈ నీటి విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎంతో మేలు కలగనుంది. సాగునీరు అందడంతో పంటలు కాపాడ బడతాయని రైతులు ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూటమి ప్రభుత్వ గ్రామ ప్రజలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసులో మలుపు

పల్లా బాలుగ్రామ్ సురక్షితంగా ఇంటికి చేరిక



డాక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి వివరాల మేరకు 06-04-2026 వ తేదీన ఇంటి నుండి వెళ్ళిపోయిన పల్లా బాలుగ్రామ్ ఆచూకీ లభించింది. వివరాల్లోకి వెళ్తే, బాలుగ్రామ్ అదే రోజు ఉదయం ఒక కేసు విషయమై తాడిపత్రి బస్సు ఎక్కి తాడిపత్రికి వెళ్లినట్లు తెలిసింది. అక్కడి నుండి రైలులో కర్ణాటక రాష్ట్రంలోని గదక్‌కు చేరుకున్నాడు. ఈ సమయంలో తన మొబైల్ ఫోన్‌లో సమస్య ఏర్పడి స్విచ్ ఆఫ్ అయినట్లు తెలిపారు.అనంతరం గదక్ నుండి విజయవాడకు వెళ్లి, అక్కడ హైకోర్టులో తన కేసులకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. తదనంతరం ఈ రోజు అనగా 13-04-2026 వ తేదీన తిరిగి తన స్వగ్రామానికి చేరుకున్నారు. ఇకపోతే, తన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన మిస్సింగ్ కేసు నేపథ్యంలో బాలుగ్రామ్ మైలవరం పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. అనంతరం పోలీసుల విచారణలో తన వివరాలు వెల్లడించగా, మైలవరం తహశీల్దార్ సమక్షంలో హాజరుపరిచారు.

## అంబేద్కర్ జయంతిని నిర్వహించే వారికి పలు సూచనలు చేసిన ఎస్సై టి రామకృష్ణ



**తాళ్లపూడి, ఏప్రియల్13, ప్రజాజ్యోతి న్యూస్**అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని తాళ్లపూడి మండలం ప్రజలకు ఎస్సై టి రామకృష్ణ సూచించారు.తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ అంబేద్కర్ విగ్రహాలను సందర్శించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అందరూ సహకరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సహకారంతో వేడుకలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు

## రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా మాజీ పి. ఎ.సి.ఎస్ చైర్మెన్ చింతాడ సూర్యనారాయణ

– వైకాపా ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన సూర్యనారాయణ



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి ,వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పాతపట్నం నియోజకవర్గం కి చెందిన మాజీ పి. ఎ .సి.ఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణను రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భం గా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ,మాజీ స్పీకర్ ,వైకాపా రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం మాజీ కళింగ కార్పొరేషన్ చైర్మన్, ప్రస్తుత వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్ ) ఇచ్చాపురం పరిశీలకులు దుంపల రామారావు (లక్ష్మణ రావు) మాజీ డీసీసీబీ చైర్మన్ పస్తుత వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) ఆము దాలవలస పరిశీలకులు కరిమి రాజేశ్వరరావులను సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్య నేతలను కండువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు.

## రేపటి నుంచి ఐదోవ విడత రీసర్వే ప్రారంభం తహసీల్దార్ సంజీవ రెడ్డి




**దువ్వూరు, ఏప్రిల్ 13 ( ప్రజా జ్యోతి )** రైతులు రీ-సర్వేలో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని సోమవారం గ్రామ సచివాలయంలో రైతులతో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ సంజీవ రెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా, హద్దులు, తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందని చెప్పారు.ఈ రి సర్వే ఐదోవ విడతలో దువ్వూరు రెవిన్యూ పొలం జరుగుతున్నట్లు తెలిపారు.రి సర్వే జరుగుతున్న సమయంలో రైతులు అందుబాటులో ఉండి, తమ దగ్గర భూమికి సంబందించిన పత్రాలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసర్వే ఉప తహసీల్దార్ కరీముల్లా, మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి,ఆర్ఐ జాన్సన్,వీఆర్వోలు మునిస్వామి, జోహారుద్దిన్ మరియు సచివాలయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.గ్రీవెన్స్ సెల్ : తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం తహసీల్దార్ సంజీవ రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వికరించారు.

## పిల్లల ఆరోగ్యమే లక్ష్యం పోషణ పక్వాడలో ఐసిడిఎస్ ప్రత్యేక ఆకర్షణ

స్క్రీన్ అలవాట్ల దుష్ప్రభావాలపై అవగాహన -- సూపర్ డాడీ కార్యక్రమంతో ఆకట్టుకున్న ఐసిడిఎస్



**బాపట్ల ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**బాపట్ల జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పడమర బాపట్ల సెక్టార్ ముత్తయిపాలెం పంచాయితీలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సరైన పెంపకం పట్ల సమాజంలో చైతన్యం కల్పించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందనను రాబట్టింది.ఈ సందర్భంగా సూపర్వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో ప్రత్యేక డెమోన్స్ట్రేషన్ నిర్వహించి, స్క్రీన్‌లకు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన ఎలా మారుతుందో, అలాగే ఆటపాటల ద్వారా సమూహంలో పెరిగే పిల్లల అభివృద్ధి ఎలా ఉంటుందో స్పష్టంగా వివరించారు. ఈ ప్రదర్శన తల్లిదండ్రులను ఆలోచింపజేసింది.అదేవిధంగా సూపర్ డాడీ కార్యక్రమం ద్వారా తండ్రులను కూడా పిల్లల పెంపకంలో భాగస్వాములుగా మార్చే ప్రయత్నం చేశారు. గేమ్స్, వినోదాత్మక కార్యక్రమాల ద్వారా కుటుంబ సభ్యులందరినీ చేర్చి పిల్లలతో అనుబంధాన్ని పెంపొందించే సందేశాన్ని అందించారు.జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాలు, సమతుల్య పోషకాహారం అవసరం, స్క్రీన్ టైమ్ అధికమైతే చిన్నారుల మానసిక-శారీరక ఆరోగ్యంపై పడే ప్రతికూల ప్రభావాలపై నిపుణుల తరహాలో వివరణ ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం తల్లిదండ్రుల్లో మంచి మార్పుకు దారి తీస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది.కార్యక్రమంలో స్థానిక పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామస్థులు ఐసిడిఎస్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. పోషణే ప్రగతికి పునాది అనే నినాదాన్ని ఆచరణలోకి తీసుకువస్తూ ఐసిడిఎస్ చేస్తున్న ప్రయత్నాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

## మైలవరం పలు ప్రాంతాలకు బూత్ అబ్జర్వర్ గా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు



**విజయవాడ , ప్రజాజ్యోతి న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు మేరకు మైలవరం నియోజవర్గంలో పలు ప్రాంతాలకు బూత్ అబ్జర్వర్ గా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్ర రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం బూత్ స్తాయిలో కార్యకలాపాల పురోగతి రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చర్చించారు. బూత్ స్తాయిలో నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

## కూటమి ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి

- శరవేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు
- పి. ఏ.సి.ఎస్ మాజీ అద్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ





**పొందూరు , జ్యోతి న్యూస్ :**కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పి.ఏ.సి.ఎస్ మాజీ అద్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ అన్నారు. పొందూరు మండలం మజ్జిలపేట గ్రామంలో ఎస్సీ కాలనీ నుండి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు సుమారు 88 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈయనకు మాజీ మాజీ సర్పంచ్ గురుగుబెల్లి జనక చక్రవర్తి ,ఉపాద్యాయులు వావిలపల్లి వెంకట సత్యన్నారాయణ ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేని సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టి గ్రామాలలో అసలైన పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు కాలువలు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతీ పంచాయతీలో ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్లు , బీటీ , డ్రైనేజీ లను ఏర్పాటు చేయించి గ్రామాల రూపురేఖలను మారుస్తున్న ఘనత ఎమ్మెల్యే కూన రవికుమార్ కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గోరింట నీటి సంఘం అధ్యక్షులు గురుగునెల్లి ఇంద్ర దరుడు ,రిటైర్డ్ ఉపాద్యాయులు గురుగుబెల్లి సన్యాసిరావు ,తమ్మినేని కోదండ స్వామి ,ఎన్ని ప్రభాకర రావు , మాజీ ఎంపీటీసీ ప్రతినిధి సువ్వరి రమణ మూర్తి,కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం, ప్రజాస్వామ్య చైతన్యం. సబ్ రిజిస్ట్రార్ జి భాలసుబ్రహ్మణ్యం.

**నంద్యాల ఎప్రిల్ = 13 ప్రజాజ్యోతి** సమాచార హక్కు చట్టం పై ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి అవగాహన చైతన్యం అవసరమని సబ్ రిజిస్టర్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణంలో సోమవారం సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారం కోసం పౌరులు చేసుకున్న విజ్ఞప్తులకు సకాలంలో స్పందించడాన్ని సమాచార హక్కు చట్టం 2005 తప్పనిసరి చేసిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు నిధుల వ్యయం, మరియు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈసీలు, దస్తావేజు నకలు, ఓల్డ్ రిజిస్టర్ ఎంట్రీలు, ఆన్లైన్ రికార్డులు, తదితరుల వివరాల కోసం సమాచారాన్ని త్వరగా శోధించడం కోసం పౌరులకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకతనూ జవాబుదారీతనాన్నీ ప్రోత్సహించడం, అవినీతిని నిరోధించడం, ప్రజాస్వామ్య పరిపాలనలో ప్రభుత్వం మరింత జవాబుదారీగా సేవలు అందించేందుకు ఈ చట్టం ఒక పదునైన సమాచార సాధనంగా ఉన్నదని తెలియజేశారు.



ప్రభుత్వ కార్యకలాపాల గురించి పౌరులకు అవగాహన కలిగేలా చేయడంలో సమాచార హక్కు చట్టం పై అవగాహన చైతన్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కె పద్మనాభం జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి ఆఫీస్ సబార్డినే కుమారిదేవి సిబ్బంది మరియు పౌరులు పాల్గొన్నారు.

## పడవ ప్రయాణమ ప్రాణాలతో చెలగాటమ...?



**వేలేరుపాడు : 13 ఏప్రిల్ వేలేరుపాడు :ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** రుద్రమకోట, కూనవరం ఫెర్రి పాయింట్ నుండి వందల మంది ప్రజలు నిత్యం గోదావరి నదిలో ప్రయాణం చేస్తూ ఉంటారు, కానీ ప్రయాణీకుల సౌకర్యం, జాగ్రత్తలు మాత్రం శూన్యం గానే కనిపిస్తున్నాయి అని చెప్పవచ్చు, ఆదివారం రోజున జరిగిన సంఘటన ఆధారంగా,నాటు పడవలో గోదావరి నది లో ప్రజలను, మోటార్ సైకిల్స్ ని దాటించే క్రమంలో అవి అదుపు తప్పి నదిలో పడిపోగా వాటిని స్థానికులు, ప్రయాణీకులు ఒడ్డుకు తీసుకుని వచ్చారు, అదే ప్రయాణీకులకు ఏదైనా జరిగి ఉంటే పెద్ద నష్టమే జరిగి ఉండేది,కనీసం లైఫ్ జాకెట్ లు కూడా లేకుండా పడవనిండా జనాల్ని ఎక్కించడం గమనార్హం.ఐతే వాహన యజమానులకు గుత్తే దారు కొంత నష్ట పరిహారం చెల్లించినట్టు సమాచారం, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుకుంటున్నారు, పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్సై నవీన్ తెలిపారు.

## అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పేద ప్రజల నివాస స్థలాల సమస్యలు పరిష్కరించాలని నిరసన



**మదనపల్లె ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** మదనపల్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం పేద ప్రజలకు స్థలాల కోసం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్ కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మురళి, కోటేశ్వరరావు లు ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన పేదలకు తక్షణమే నివాస స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమి ఇవ్వడమే కాకుండా, ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు నిర్మించేందుకు ఆర్థిక సహాయం కూడా అందించాలని ఆయన కోరారు. ప్రజలకు కనీస అవసరమైన నివాస హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోక పోతే, సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర సిపిఐ రాయచోటి నియోజకవర్గం సభ్యులు బత్తల వెంకటరమణ, ఓబులేసు, ఆంజనే యులు జగన్ బాబు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల వేగవంత పరిష్కారం

**-- గుంటూరు ఎస్పీ వకుల్ జిందల్**

**గుంటూరు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతిపత్రాలను నేరుగా పోలీస్ అధికారులకు అందజేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 178 ఫిర్యాదులు స్వీకరించారు.ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్లకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని ఆయన తెలిపారు. ఫిర్యాదుదారులకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ మోసాలపై జాగ్రత్తలు సూచించారు. నూతనంగా



ఏర్పాటుచేసిన పి జి ఆర్ ఎస్ భవనంలో ప్రజలు సౌకర్యవంతంగా తమ ఫిర్యాదులు వినిపించుకునే వాతావరణం కల్పించడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్స్) సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, వెస్ట్ సబ్ డివిజన్ ఇంచార్జి డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్, పీజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య కమిషనర్ ఆదేశాల మేరకు మహిళా రిజర్వేషన్ బిల్లు పై అవగాహన




**గుంతకల్లు ఏప్రిల్ 13 (ప్రజా జ్యోతి):** స్థానిక ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి ) గుంతకల్లు లో ప్రభుత్వ మరియు కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు "స్త్రీ శక్తి" నారీ శక్తి వందన్ అధినీయం -2023 అనే అంశం ఆధారంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ .లక్ష్మయ్య మాట్లాడుతూ వికసిత్ భారత్ మరియు స్వర్ణాంధ్ర 2047 సాధన లో స్త్రీల యొక్క పాత్ర చాలా ముఖ్యమని, అందుకు ఈ బిల్లు ఎంతో ఉపయోగపడు తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కళాశాల విద్యార్థిను లు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కే గోపి నాయక్ మరియు యస్.దేవి చైతన్య లు మాట్లాడుతూ ఈ బిల్లు ప్రారంభం నుండి నేటి వరకు జరిగిన అనేక పరిణామాలను సవివరంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు విద్యార్థులు నారీ శక్తి ప్రతిజ్ఞను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు ఎన్ ఏ అల్తాఫ్, డా. సి బాలకృష్ణ, వనజమ్మ, ఇతర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం పాల్గొనడం జరిగింది.

## ధర్మవరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ భవనానికి 50,000 విలువచేసే టైల్స్ వేయించిన వైసీపీ నేత ముదునూరి మురళి రాజు





**కాకినాడ జిల్లా ఏప్రిల్ 13( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలంలో ధర్మవరం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ భవనానికి ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు,నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు తన సొంత నిధులు రూ.50 వేలు వ్యయంతో టైల్స్ ఏర్పాటు చేసారు.ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముదునూరి మురళీ కృష్ణంరాజు సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని,అంబేద్కర్ ఆశయాల ప్రకారం సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ముదునూరి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముదునూరిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో యాళ్ల ఏసు,జువ్వల మసలయ్య,యాళ్ల రాంబాబు (రాము),రాపా గుర్రాజు,రాపా అప్పన్న,సిద్ధాంతపు రాజశేఖర్, కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ తూపాటి బాబ్జి,దడాల నాగభూషణం,రాపా రాజేష్,మారెళ్ళ అప్పన్నబాబు,దడాల అప్పారావు,ఇంటి వీర్రాజు,అంబటి గణేష్ తదితర అంబేద్కర్ యువత సభ్యులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన భూ సమస్యలు...

పరిష్కార దిశలో తహసిల్దారు .......

సమస్యలు తెలుసుకుంటున్న తాసిల్దారు ఫణీంద్రుడు .....




**చాగలమర్రి , ఏప్రిల్ 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండలంలోని వివిధ గ్రామాలలో గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన భూ సమస్యలను నూతనంగా విధుల్లో చేరిన తహసిల్దార్ ఫణీంద్రుడు యుద్ధ ప్రాతిపదికన పరిష్కార దిశలో రికార్డులను పరిశీలించి సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పి జి ఆర్ ఎస్) లో వచ్చిన ఫిర్యాదులకు స్పందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పరిష్కరించుటకై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన అర్జీలను పరిశీలించారు. రేషన్ కార్డులు కొరకు, పొలాలకు వెళ్లే రాస్తా, రికార్డులలో తప్పులతడకగా నమోదైన భూములు ఇంటి స్థలాలు, భూముల ఆక్రమణలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్లైన్లో నమోదు కార్యక్రమాలు, పట్టా భూముల్లో దౌర్జన్యంగా ఆక్రమించడానికి సాగు చేస్తున్న వారిపై వచ్చిన అర్జీలను పరిశీలించారు. గతంలో పనిచేసిన ఇన్చార్జి తహసిల్దార్ నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో పలు సమస్యలు పేరుకుపోయాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఇంజనీర్ కొండారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రంగ నేతాజీ, వివిధ శాఖ అధికారులు హాజరయ్యారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం...

మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్ ........



**చాగలమర్రి , ఏప్రిల్ 13( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** రాజ్యాంగ పితామహుడు, దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామాలలో, మండల కేంద్రాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు కమటం నాగేష్ అన్నారు. సోమవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ వివిధ మతాలు, వివిధ కులాల వారు ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశంలో ఉండగా , కులాలను మతాలను వేరుచేసి దళితుల మధ్య వర్గ విభేదాలు సృష్టించడం తగదని అన్నారు. అంబేద్కర్ ఒక కులానికి ఒక మతానికే కాదు అందరివాడని ఆయన తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకుంటూ జయంతి ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్



**రాజంపేట, ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతిని రేపు అనగా 14 తేదీ నాడు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిండ్ల మహేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు రేపు ఉదయం 9:00 గంటలకు మండల కేంద్రాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారుఈ సందర్భంగా పిల్లిండ్ల మహేష్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ గారు భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించడమే కాకుండా, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే నాలుగు మూల స్తంభాలపై దేశాన్ని నిలబెట్టిన మహానుభావుడని కొనియాడారు.అంబేద్కర్ గారి ఆశయాలు ప్రతి భారతీయుడి హృదయంలో నిలిచిపోవాలని, ఆయన బాటలో నడిచినప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తూ, అన్ని వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు.ఈ జయంతి కార్యక్రమంలో నియోజకవర్గం క్లస్టర్లు, కో-క్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు, గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అంతిమంగా డాక్టర్ అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత ,బడుగు బలహీన వర్గాల దేవుడు బి ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు జయప్రదం చేయండి.

ప్రజాసంఘాల ఐక్యవేదిక

నేడు బిఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు



**బనగానపల్లె ఎప్రిల్ = 13 ప్రజాజ్యోతి** నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా 135 వ వేడుకలు నిర్వహించబడుతుంది. కావున కేంద్ర ,రాష్ట్ర పార్టీలు, ప్రభుత్వ ఆఫీసు అధికారులు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జమ్మలమడుగు సర్కిల్ నందు ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని దీనికి ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోవెలకుంట ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆహ్వానిస్తున్నాము.

# క్లియర్ వ్యూ లాసిక్ నేత్ర చికిత్సా కేంద్రం ప్రారంభించిన మంత్రి ఫరూక్

### ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్లియర్ వ్యూ లాసిక్ సెంటర్

### నంద్యాల వైద్య కేంద్రంగా రూపొందింది: మంత్రి ఫరూక్.



**నంద్యాల ఏప్రిల్ 13 ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లాలలో పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ పై అంతస్తులో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ విజయ భాస్కర రెడ్డి ఏర్పాటు చేసిన క్లియర్ వ్యూ లాసిక్ సెంటర్ ను సోమవారం రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. కేంద్రంలోని వివిధ విభాగాలను ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రోటరీ మాజీ గవర్నర్ కల్లూరు రామలింగారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ కంటి అద్దాల అవసరం లేకుండా కంటిలో చేసే చికిత్స కోసం అత్యాధునిక లేజర్ లాసిక్ సెంటర్ ను నంద్యాలలో ఏర్పాటు చేశామని, నంద్యాలలో ఉన్న నేత్ర వైద్యులు అందరూ ఈ కేంద్రంలో కంటి అద్దాలు అవసరంలేని చికిత్సలు చేసుకోవచ్చని అన్నారు. రాయలసీమలో ఇది అత్యాధునిక రెండవ కేంద్రమని,రాష్ట్రం ఈ స్థాయి కేంద్రాలు నాలుగు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు. ఈ అవకాశాన్ని నంద్యాల, కర్నూలు జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో కంటి అద్దాలు అవసరం లేని చికిత్స కోసం కోట్లాది రూపాయల విలువ చేసే పరికరాలతో అత్యాధునిక కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ రంగంలో ఇటు ప్రైవేటు రంగంలో వైద్య కళాశాల ఆసుపత్రులు ప్రైవేటు ఆసుపత్రులలో నిష్ణాతులైన వివిధ రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని, నంద్యాల వైద్య కేంద్రంగా మారిందని అన్నారు. నంద్యాల వైద్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రంలో ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి కంటి అద్దాలు లేని చికిత్స కోసం కేంద్రం ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నంద్యాల ప్రజలు ఇప్పుడు అన్ని చికిత్సలు నంద్యాలలోనే అందుకుంటున్నారని, కర్నూలు, హైదరాబాదు లకు పోవడం బాగా తగ్గిపోయిందని అన్నారు. నంద్యాల వైద్యులు వ్యక్తిగతంగా, ఐఎంఏ ద్వారా వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు సుదీర్ఘ కాలంగా నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ తో పాటు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ,రోటరీ మాజీ గవర్నర్ లు కల్లూరు రామలింగారెడ్డి, చిన్నపరెడ్డి, ఐఎంఏ నాయకులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ,డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, డాక్టర్ హరిత, డాక్టర్ అరిఫా భాను,అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

# సాక్షి మీడియా మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి గారి పై ఎన్ని అసత్య ప్రచారాలు చేసిన వైసీపీ ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

### మంత్రిగారు మాట్లాడింది ఒకటైతే సాక్షి మీడియా మరోలా అసత్య ప్రచారం చేయడం తగదు
### టిడిపి కార్యకర్తలు, నాయకులు వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతం కోసం పని చేయాలని మంత్రిగారు ఆదేశిస్తే సాక్షి మీడియా వక్రీకరించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం
### సాక్షి మీడియా కథనం ఘాటుగా స్పందించిన టిడిపి రాయచోటి పట్టణఅధ్యక్షుడు బోనమల ఖాదర్ వల్లి



**రాయచోటి ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** సాక్షి మీడియా, వైసిపి కలిసి మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా రాయచోటి ప్రాంత ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టిడిపి రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వల్లి అన్నారు. రాయచోటి టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఒక పక్క వైసిపి, మరోపక్క సాక్షి మీడియా కలిసి నిత్యం మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై బురదజల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. రాంప్రసాద్ రెడ్డి కి వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేకే సాక్షి మీడియాను అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు పబ్బం గడుపుకోవాలని చూడడం సమంజసం కాదన్నారు. రాయచోటిలో జరిగిన టిడిపి కార్యకర్తల సమావేశంలో పార్టీలో అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని, గతంలో జరిగిన ఎన్నికల్లో 83 పోలింగ్ బూతులలో కొన్ని సమీకరణల తోపాటు కొందరి కారణంగా ఓటింగ్ తగ్గినా కూడా తాను గెలుపొందడం జరిగిందని మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి చెప్పారే తప్పా ఎక్కడా కూడా రాష్ట్రంలో టిడిపి గ్రాఫ్ పడిపోయిందని ఎక్కడ కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. గ్రూప్ రాజకీయాలను వదిలేసి సమిష్టిగా ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త, నాయకులు కలిసి రాయచోటి నియోజకవర్గంలో టిడిపి బలోపేతం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారన్నారు. దీన్ని సాక్షి మీడియా, వైసిపి నేతలు వక్రీకరిస్తూ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై నిరాధారణ ఆరోపణలు చేయడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం తగదన్నారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి నిరంతరం శ్రమిస్తూ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గారు, మంత్రివర్యులు నారా లోకేష్ గారి తోపాటు రాష్ట్రంలో ఉన్న మంత్రులతో మమేకమై రాయచోటి ప్రాంతానికి రావాల్సిన నిధులు కోసం కృషి చేస్తున్న ఏకైక నాయకుడు మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి అని అన్నారు. రాత్రింబగళ్లు మంత్రివర్లు రాంప్రసాద్ రెడ్డి గారు, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి గారు నిత్యం ప్రజలలో తిరుగుతూ వారి కష్టనష్టాలను తెలుసుకుంటున్నారన్నారు. మండిపల్లి సోదరులకు వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక సాక్షి మీడియా, వైసిపి నేతలు ఇలాగే వ్యవహరిస్తే సరైన సమయంలో దీటైన సమాధానం చెప్పాల్సి వస్తుందని ఆయన ఘాటుగా స్పందించారు.

# వెబ్‌ల్యాండ్ సమస్యలకు చెక్ రైతులకు ఊరట!

**ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు పరిష్కారం -- 1దీ పత్రాల పంపిణీ**

**రైతులకు పారదర్శక సేవలే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**




**మదనపల్లి, ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ వెబ్‌ల్యాండ్ సమస్యలకు జిల్లా యంత్రాంగం వేగంగా పరిష్కారం చూపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా, మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఏళ్లుగా పరిష్కారం కాని వెబ్‌ల్యాండ్ సంబంధిత సమస్యలను పరిష్కరించి, సంబంధిత రైతులకు 1దీ (అడంగల్) పత్రాలను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో, వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించిన ఇద్దరు రైతులకు జిల్లా కలెక్టర్ స్వయంగా 1దీ పత్రాలను అందజేశారు. గత అనేక సంవత్సరాలుగా సర్వే నంబర్ సవరణలు, కొత్త సర్వే నంబర్ల చేర్పులు, అడంగల్ వివరాల సరిదిద్దడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఈ చర్యల ద్వారా ఊరట లభించింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత పాత రికార్డులు, దస్త్రాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా మూడు నుంచి ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.భూమి రికార్డులు సరిగ్గా ఉండటం రైతులకు అత్యంత కీలకమని, పంట రుణాలు, భూమి లావాదేవీలు మరియు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో వెబ్‌ల్యాండ్ రికార్డులు ముఖ్య పాత్ర పోషిస్తాయని కలెక్టర్ వివరించారు. రికార్డుల్లో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే జిల్లా పరిపాలన ప్రధాన లక్ష్యమని తెలిపారు.మిగిలిన దరఖాస్తులను కూడా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## బీసీ ధర్మ దీక్షకు సంపూర్ణ మద్దతు

ఏపీ మేధావుల ఫోరం



**రాయచోటి ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** బీసీ నేత బోడె రామచంద్ర యాదవ్ చేపట్టిన ధర్మదీక్షకు త మ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జీవానందం అన్నారు. సోమవారం రాయచోటిలో తమ ఫోరం నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడా రు. బీసీ రక్షణ చట్టం, బీసీ కులాల కార్పొరేష న్లకు నిధులు, సమగ్ర కులగణన, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పన తదితర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 50% పైగా ఉన్నప్పటికీ రాజ్యాధికారంలో, సంపదలో తగిన మాట దక్కడం లేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు గా మాత్రం వాడుకుంటున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే, పెరియార్, నారాయణ గురు లాంటి మహనీయులు అలలుగన్న సామాజిక న్యాయం సాధనకు బిసి ధర్మ దీక్ష ఒక బలమైన అడుగు అని చెప్పారు. బీసీ ధర్మదీక్ష డిమాండ్లు నెరవేరేవరకు రాష్ట్రంలోని అన్ని కుల సంఘాలు ప్రజా సంఘాలు మేధావులు ఏకమై ఉద్యమించాలంటూ ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయన తోపాటు రాయలసీమ జిల్లాల మేధావుల ఫో రం నేతలు దేవేంద్ర, పెద్దన్న ,శంకర్, వెంకట స్వామిలు పాల్గొన్నా రు.

## మదనపల్లె ఆర్ఓ కు పల్లవి అరెస్ట్ వారెంట్



**మదనపల్లె ఏప్రిల్ 13 ప్రజా జ్యోతి** అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్ గా పనిచేసి ప్రస్తుతం మదనపల్లె మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ (ఆర్ఓ ) జీవి.పల్లవి అరెస్ట్ కు హైకోర్టు ఈనెల 2న ఉత్తర్వు జారీ చేసింది. ఆమెను అరెస్ట్ చేసి ఈనెల 30న న్యాయస్థానం ముందు హాజరుపర్చాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. మున్సిపాలి టీలో ఒక వ్యక్తి ప్లాన్ అప్రూవల్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారని, అక్రమంగా జరుగుతున్న ఈ పనిని కమిషనర్ అడ్డుకోలేదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపారని పేర్కొంటూ రెడ్డెప్ప అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నడుస్తుండగా విచారణ కోసం పల్లవిని ఆన్లైన్ లో హాజరు కావాలని తెలియజేసిన ప్పటికి ఆమె హాజరు కాలేదని కోర్టు దృష్టికి వచ్చింది. దీన్ని కోర్టు ధిక్కారంగా భావిస్తూ ఆమెకు బెయిలబుల్ వారంట్ ను జారీ చేయాలని న్యాయ స్థానం ఆదేశించింది. ఈనెల 30 జరిగే తదుపరి విచారణ రోజు ఆమె కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఈ వారెంట్ ను అమలు చేయాలని జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలను పంపారు. ఒకవేళ అరెస్ట్ చేస్తే రూ.10వేల బాండు, ఇద్దరి పూచికత్తుపై బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. అలాగే ఈనెల 30న జరిగే కేసు వాయిదాకు హాజరవుతానని, ఆ తర్వాత కూడా కోర్టు ఆదేశించే వరకు హాజరు వుతానని ఆమె ప్రమాణపత్రం ఇవ్వాలని ఆదే శాల్లో న్యాయస్థానం పేర్కొంది.

## పేద విద్యార్థులకు ఉన్నత విద్య కష్టమే




**ప్రజా జ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్** పాతపట్నం నిర్దేశిత సమయం లోగా ఫీజు చెల్లించకపోతే వడ్డీతో కలిపి దాన్ని చెల్లించాలని కొత్త విధానానికి కార్పొరేట్ స్కూలులు తెరలేపాయి. ప్రైవేట్ యూనివర్సిటీల చట్ట సవరణతో కన్వీనర్ కోటా 30 శాతానికే పరిమితం. ఆందోళనలో విద్యార్థుల తల్లి దండ్రులు విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించి విద్యార్థుల భవిష్యత్ తో ఆటలా. వైఎస్ ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో విమర్శించారు.నిర్దేశిత సమయం లోగా ఫీజు చెల్లించకపోతే వడ్డీతో కలిపి దాన్ని చెల్లించాలని కొత్త విధానానికి కార్పొరేట్ స్కూలులు తెరలేపాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థితిని బట్టి విద్యా సంవత్సరం ప్రారంభంలోనో, మధ్యలోనో, చివరిలోనో ఫీజులు చెల్లిస్తుంటారు. ఆర్థిక భారంతో సతమతమవుతున్న వీరికి గుండెల్లో గుచ్చేవిదంగా విద్య సంవత్సరం ప్రారంభం కాకుండగానే ఫీజు చెల్లించాలని గడువు విధించడం, నిర్దేశిత సమయం లోపు చెల్లించకపోతే వడ్డీ విధిస్తామని చెబుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నాడు – నేడు పనులు, ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ ఆగిపోయింది. మెడికల్ కాలేజీలు అమ్మేస్తున్నారు. ముఖ్యమైన ప్రాజెక్టులన్నీ ఆపేశారు. అన్ని రంగాల్లోనూ తిరోగమనమే.చంద్రన్న పాలనలో మహిళలకు దక్కింది శూన్యం.. పెరిగింది భయం! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల ఊసే లేకుండా పోయింది. ప్రతి పంచాయతీలో సుమారు 30 నుండి 40 మంది అర్హులైన వితంతు మహిళలు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. వారి పరిస్థితి ఏమిటో ఈ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు.జగనన్న ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలు మహిళలను లక్షాధికారులుగా మార్చాయి. కానీ నేడు ఆ పథకాల అమలు సక్రమంగా లేక, మహిళలు మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మహిళా సాధికారతను ఈ ప్రభుత్వం పూర్తిగా కూల్చివేసింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళలకే అగ్రతాంబూలం దక్కిందని గుర్తు చేశారు. అమ్మఒడి ద్వారా తల్లులకు అండగా నిలవడం, ఇళ్ల పట్టాలను మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయడం, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలు జగనన్నకే సాధ్యమయ్యాయని కొనియాడారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, మరియు వి ఎ ఓ ల వేతనాలను పెంచి వారికి అండగా నిలిచారు. కానీ నేడు క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళా ఉద్యోగులకు కనీస భరోసా కరువైందన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు యస్ హెచ్ జి అండగా ఉన్న 'సున్నా వడ్డీ' పథకాన్ని ఈ కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సాగిన జగనన్న పాలన ఒక ఎత్తు అయితే, కేవలం ప్రచారానికే పరిమితమవుతున్న ప్రస్తుత కూటమి పాలన మరో ఎత్తు. ఓట్ల కోసం అసాధ్యమైన హామీలిచ్చి, ఇప్పుడు అమలు చేయకుండా తప్పించుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరును మహిళా లోకం గమనిస్తోంది. ఇప్పటికైనా కాలయాపన మానుకుని, తక్షణమే అర్హులైన ప్రతి మహిళకు నెలకు ?1500 సాయాన్ని అందించాలని, డిమాండ్ చేశారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అవమానాల పై గెలిచిన అక్షర యోధుడు

**ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా జీవించే, మాట్లాడే, మతపరమైన ఆచారాలను పాటించే హక్కును రాజ్యాంగం కల్పిస్తుంది. పౌరుల హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించే అధికారాన్ని ఇది ఇస్తుంది.**

**ప్రభుత్వాలు ఐదేళ్లకు ఒకసారి మారవచ్చు, కానీ దేశం ఎప్పుడూ ఒకే పద్ధతిలో, స్థిరమైన నిబంధనలతో నడవడానికి రాజ్యాంగం పునాదిగా ఉంటుంది.**

**అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను రూపుమాపడానికి మరియు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు వంటి సౌకర్యాల ద్వారా వారిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి రాజ్యాంగం ఒక సాధనంగా పనిచేస్తుంది.**









**(జీలుగుమిల్లి / ప్రజాజ్యోతి)** నేడు ప్రపంచ వ్యాప్తంగా, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ప్రజలు ఆరాధన తోనూ,ప్రభుత్వాలు అధికారికంగానూ ఘనంగా నిర్వహిస్తూ ఉన్నారు. నేను ఈ కాలం రాసే సమయానికి మన దేశ రాజధాని దిల్లీలో ఉన్నాను. నిన్న ఇండియా గేట్ వద్ద ఆ సందడి గమనించాను. అంబేద్కర్ చిన్నతనం నుండి చనిపోయే వరకూ ఫొటో ఎక్సిబిషన్, పుస్తకాల ప్రదర్శన సందర్శకుల కోసం ఏర్పాటు చేశారు. ఇంకా కోనసీమ జిల్లా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అంబేద్కర్ ప్రభావం అక్కడి ప్రజల పై చాలా ఎక్కువ. ఒక విధంగా ప్రతీ ఇంట్లో ఆయన ఫోటో పెట్టుకుంటారు. వారికి దైవంతో సమానం. ఇప్పటికే ఆ జిల్లా లో ఉన్న కొన్ని గ్రామాల్లో భారీ బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించి నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడుతున్నారు.ఒక్క మన దేశంలో నే కాదు, ఏప్రియల్ 14 నాడు ఆయన జన్మదినాన్ని గౌరవ సూచకంగా ఐక్య రాజ్యసమితి "ప్రపంచ విజ్ఞాన దినోత్సవం"గా ప్రకటించింది.125 వ జయంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లో ఉన్న అసమానత లు రూపు మాపటం కోసం 2016 నుండి 2030" సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు" (ాణ+) కూడా పెట్టుకుంది. సభ్య దేశాలు ఆ లక్ష్యాలు అమలు కోసం కృషి చేయాలి.యునైటెడ్ నేషన్స్ అలా అంబేద్కర్ ను గౌరవించటం వలన అది మన దేశానికి దక్కిన గౌరవం గా భారతీయులందరూ గర్వ పడాలి. ఐక్య రాజ్యసమితి సభ్య దేశాలు, ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు తో కూడిన సమసమాజ స్థాపన ప్రపంచ దేశాల లో ఉన్న అసమానత లు తొలగించడం కోసం, అంబేద్కర్ ఆలోచనలు, పొలిటికల్ ఫిలాసఫీ గురించి సభలు,సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిస్తాయి.అంబేద్కర్ అంటే ఎక్కువ గా రాజ్యాంగ నిర్మాత అని చెప్పుకుంటారు. అది నిజం కూడాను.మన దేశంలో భారత రాజ్యాంగ మే సుప్రీం లా.ఎవరికి ఏ కష్టం వచ్చినా రాజ్యాంగం చేత పడుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ప్రాథమిక హక్కుల కు భంగం కలిగితే, కేశవా నంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగం యొక్క మౌలిక స్వరూపం ను పార్లమెంటు మార్చకూడదని అది రాజ్యాంగ ప్రధాన లక్ష్యంగా చెప్పింది.అంతటి మంచి రాజ్యాంగాన్ని అందించిన మేధావి అంబేద్కర్ అని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయి.నేడు ప్రపంచంలో రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు ఉన్నాయి.వాటిలో ఒకటి అతి ప్రాచీనమైన రాజ్యాంగం కలిగిన అమెరికా,రెండవది ప్రపంచంలో నే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన ఇండియా.ఈ రెండు దేశాలు రాజ్యాంగ విలువలు,ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజల హక్కుల గురించి చాలా గొప్పగా మాట్లాడుతూ ఉంటాయి.ఈ రెండు దేశాలూ అంబేద్కర్ గారి గురించి కూడా చాలా గొప్పగా మాట్లాడుతూ ఉంటాయి. కానీ, అమెరికా పేద దేశాల పై చేస్తున్న దాడులు గురించి అలాగే మన దేశంలో మతం పేరుతో మైనార్టీ మతాల వారి పై నేటికీ అంటారని కులాల వారి కి గుడిలో ప్రవేశం నిరాకరణ గురించి మాత్రం నోరు మెదపక పోవటం గమనార్హం.

### అంబేద్కర్ జన్మ స్థలం:

అటువంటి గొప్ప ప్రపంచ మేధావి, నేటి మధ్య ప్రదేశ్ రాష్ట్రం లో ఉన్న "మౌ" అనే గ్రామంలో ఉన్న మిలిటరీ కంటోన్మెంట్ లో తన అమ్మమ్మ గారి ఇంట ఏప్రియల్ 14 తేదీన 1891 సంవత్సరం లో జన్మించారు.తండ్రి పేరు – రామ్ జీ సక్పాల్ తల్లి పేరు – రమా బాయి.తండ్రి స్వగ్రామం – అంబవాడ జిల్లా – రత్న గిరి రాష్ట్రం – మహారాష్ట్ర పుట్టిన కులం – మహర్ అనే అస్పృశ్యత కులం. అంబేద్కర్ గారి తాత ముత్తాతలు బ్రిటిష్ ఆర్మీ లో సైనికులు గా పని చేశారు.ఆయన తండ్రి రామ్ జీ సక్పాల్ కూడా సైన్యం లో పని చేసి సుబేదార్ హోదా లో రిటైర్డ్ అయ్యి సతారా అనే పట్టణం లో స్థిర పడ్డాడు.ఆ కాలం లో దేశంలో ఉన్న సుమారు నాలుగు కోట్ల మంది అంటారని కులాల వారికి ఏ హక్కులూ లేని సమయంలో "మహర్"అని పిలవబడే అంటారని కులం లో 14 వ సంతానం గా జన్మించింది ఒక ఆశా జ్యోతి. తల్లి తండ్రులు ఆ జ్యోతి కి పెట్టిన పేరు భీమా రావు రామ్ జీ. అయితే అంబేద్కర్ చిన్నతనం నుండి చదువులో చూపిస్తున్న శ్రద్ధను గ్రహించి ప్రోత్సహించిన గురువు బ్రాహ్మణుడు. ఆయనే తన పేరుతో కలిపి భీమ్ రావ్ అంబేద్కర్ గా రికార్డు లో మార్పు చేసింది. అప్పటి నుండి ఆయన పేరు అంబేద్కర్‌గా ప్రసిద్ధి చెందింది. బహుశా ఆ సమయం లో వారు అనుకొని ఉండరు తమ కడుపున పుట్టింది "ఆధునిక బుద్ధుడు" అని. ఐగుప్తు దేశం నుండి వాగ్దానా భూమికి ఇశ్రాయేలీయుల ను నడిపించిన మోషే ఈ దేశంలో పశువులు కంటే హీనంగా బానిసలుగా బతుకుతున్న అంటారని కులాల వారిని బానిసత్వం నుండి విముక్తి చేయడానికి మరలా పుట్టిన మరో "మోజెస్" అని అనుకొని ఉండరు.మీ బిడ్డే రేపటి రోజు ఈ దేశ ప్రజలు ఎలా నడుచుకోవాలో నిర్ణయించే గొప్ప రాజ్యాంగ నిర్మాత అవుతాడని బహుశా కలలో కనిపించి ఏ ప్రవక్త కూడా ఆ తల్లి తండ్రుల కు చెప్ప లేదు.ఏదైతేనేం అంబేద్కర్ ఐదవ ఏటనే తల్లి చనిపోయింది.అంబేద్కర్ చిన్నతనం నుండి చదువు లో చాలా చురుకుగా ఉండే వాడు. ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గొప్ప గొప్ప విశ్వవిద్యాలయాల నుండి

**32 డిగ్రీ పట్టాలు తీసుకున్నారు.**

64 సబ్జెక్టు ల్లో గొప్ప నిష్ణాతుడు.9 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన దిట్ట.1990 సంవత్సరం లో "భారత రత్న" అయ్యారు.ఇంతటి గొప్ప విజయాలు అంబేద్కర్ కు అంత ఈజీగా సాధ్య పడలేదు. ఎన్నో రకాల అవమానాలు, అడుగడుగున ఎదురయ్యే కుల వివక్ష,బాలుడిగా ఉన్నప్పుడే అంబేద్కర్ అనుభవించాడు. ఈ విషయాన్ని తన "వెయిటింగ్ ఫర్ ఏ వీసా" అనే ఆత్మ కథ పుస్తకంలో రాశాడు.అంబేద్కర్ వాల్యూం 12 లో పేజీ 661 లో తన జీవితంలో తాను ఎదుర్కొన్న కులవివక్ష త గురించి వివరంగా రాశాడు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు ప్రచురించారు.ఈ అగ్ర కుల హిందువు లు అంబేద్కర్ ను ఏ విధంగా అవమానాలకు గురి చేశారో ఒకసారి తెలుసుకుందాం;

### మొదటిసారి;

అంబేద్కర్ చిన్నతనం లో తన తొమ్మిదవ ఏటా వేసవి సెలవుల్లో సతారా నుండి గోరేగావ్ గ్రామంలో ఉన్న తండ్రి వద్దకు వెళుతున్నప్పుడు, రైల్వే స్టేషన్ మాస్టర్ అలాగే ఎడ్ల బండి వాడు కులం పేరుతో అవమానాల కు గురిచేశారు. తమ వద్ద తినుబండారాలు ఉన్నప్పటికీ, త్రాగటానికి ఎవరూ నీరు ఇవ్వక ఆకలితో ఉన్నారు. ఇంకా చదివే స్కూల్ లో ఇంటి నుండి తన గోనే తానే తెచ్చుకోవడం, బయటనే కూర్చో బెట్టి ఉంచటం,పని వాడు అందరు పిల్లలు త్రాగే నీళ్ళ ను త్రాగనీయక పోవడం లాంటి అవమానకర సంఘటన లు బాల అంబేద్కర్ మనస్సు గాయ పరిచేలా చేశాయి.

### రెండవసారి;

1918 సంవత్సరం లో 5 ఏళ్ళ పాటు అమెరికా , లండన్ లలో చదువులు పూర్తి చేసికొని వచ్చి బరోడా సంస్థానం లో ఉద్యోగం చేస్తూ మహర్ కులం కారణం గా అద్దెకు ఇల్లు దొరకని పరిస్థితి ఏర్పడింది.ఇక్కడ కేవలం హిందువులు మాత్రమే కాదు, పార్సీ, ముస్లిం, క్రైస్తవ స్నేహితులు కూడా అవమానించడం అర్థం చేసుకున్నాడు. అన్ని మతాలలో కులవివక్ష ఉందని గ్రహించాడు.

### మూడవసారి;

1929 సంవత్సరం లో బొంబాయి ప్రభుత్వం అంబేద్కర్ ను అంటారని కులాల వారి సమస్యలు తెలుసుకోవటం కోసం కమిటీ సభ్యులు గా నియమించింది.ఆ పని మీద ఖండేష్ జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో సర్వే కు వెళితే, ప్రభుత్వం గుర్రపు బండి నడిపే వాడు అంటారని వాడికి నేను బండి నడపను అని తోసి వేస్తే క్రింద పడిన అంబేద్కర్ కాలు విరిగింది.

### నాలుగవ సారి;

అంబేద్కర్ గారు అతని మిత్రుల తో కలిసి అప్పటి నిజాం పాలనలో ఉన్న ఔరంగాబాద్ వెళ్ళి వస్తూ, మార్గం మధ్యలో దౌలతాబాద్ కోటను చూడాలని వెళ్ళారు. ప్రయాణం లో అలసిపోయి దాహం తీర్చుకోవడం కోసం కాళ్ళూ చేతులు కడుగు కుంటుండగా అది చూసిన ముస్లిం పరుగున వచ్చి అంటారని కులాల వారు మా నీళ్ళను మైల చేశారని తిట్టి పంపించి వేసాడు.

### ఐదవ సారి;

1929 సంవత్సరం లో గాంధీ గారి కి ఒక లేఖ రాశాడు. ఇది యంగ్ ఇండియా పత్రికలో ప్రచురితమైంది.

ఒక అంటారని కులానికి చెందిన టీచర్ భార్య న్యూమోనియా తో వైద్యం అందక చనిపోయిన సంఘటన.

తన వృత్తి ధర్మానికి విరుద్ధంగా బ్రాహ్మణ కుల డాక్టర్ వైద్యం నిరాకరించిన విషయం.

### ఆరవ సారి;

అగ్ర కులానికి చెందిన ఒక క్లర్క్ అంబేద్కర్ గారి సబార్డి నెట్ హోదాలో విధులు నిర్వహించటానికి నిరాకరణ .ఈ సంఘటన ప్రస్తుత గుజరాత్ రాష్ట్రంలో ఉన్నా బోర్సాద్ జిల్లా ఆఫీసులో జరిగింది. అందులో తలాటి (క్లర్క్)గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఒక తక్కువ కులం వాడితో ఆఫీసు లో పని చేయనని ఊరిలో కూడా ఎవరూ ఇల్లు ఇవ్వరని అవమానించాడు. చివరకు తన స్వంత అంటారని కులాల వారు కూడా అగ్ర కులాల వారి కి భయపడి ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. దానితో అంబేద్కర్ ఉద్యోగం వదలి వెళ్ళాల్సి వచ్చింది.ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ అంబేద్కర్ అణగారిన వర్గాల వారి తరపున పోరాటాలు చేశారు.ఒక్కోసారి అగ్ర కులాల వారు ఆయన పై రాళ్ళతో భౌతిక దాడులు చేసే వారు. అయినా వెనుకడుగు వేయలేదు.ఎన్ని కష్టాలు వచ్చినా ఎదురొడ్డి పోరాడిన యోధుడు అంబేద్కర్. ఇప్పుడు మనలో చాలామంది జాతి ఉద్ధోరకులమని చెప్పుకునే వారు చిన్న చిన్న సమస్యలు, కేసులు వస్తే భయపడి పోతున్నారు. కొంత మంది కాలేజీల్లో,యూనివర్సిటీల్లో కులవివక్ష చూపుతున్నారని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అది చాలా బాధాకరం. వారంతా అంబేద్కర్ వాదుల మంటూ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ ఉన్నారు.తన అనుభవాల నుండి పుట్టినదే భారత రాజ్యాంగ "సామాజిక న్యాయ సూత్రం"రాజ్యాంగం యొక్క స్పూ ర్తిని దెబ్బతీయడానికి, రిజర్వేషన్ లు అమలు చేయడం లేదని ఎంతో కాలంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల వారు ఆందోళన చెందుతున్నారు. రిజర్వేషన్ లు వ్యతిరేకించే వారు అంబేద్కర్ కేవలం ఎస్సీ ఎస్టీ ఇతర వెనుకబడిన వర్గాల కోసం రాజ్యాంగం రాశాడని విమర్శలు చేస్తూ ఉన్నారు. రాజ్యాంగ విలువలు తెలియని వారు అలా మాట్లాడతారు.

### రాజ్యాంగం ప్రకారం

"చట్టం ముందు అందరూ సమానం" అంటే ఏ ఒక్కరూ కూడా స్త్రీ, పురుషులు, మతం, జాతి, కులం, ప్రాంతం లింగ వివక్ష లేకుండా చేయడం.రాజ్యాంగ పరిషత్తు లో అంబేద్కర్ మాట్లాడుతూ "సౌభ్రాతృత్వం అంటే అర్థం ఏమిటనగా భారతీయులందరూ సహోదరులు అనే స్పృహ కలిగి ఉండటం అని,భారతీయులందరూ ఒకే ప్రజా సమూహం అని" అన్నారు.చాలా మంది మదిలో ఉన్న బలమైన అభిప్రాయం ఏమిటంటే అంబేద్కర్ అంటే భారత రాజ్యాంగ నిర్మాత అని. ఆ అభిప్రాయం కూడా తప్పనే చెప్పాలి. ఎందుకంటే...ఆయన ఒక సామాజిక తత్వవేత్త, రాజకీయ వేత్త, న్యాయ వాది. కార్మికుల నాయకుడు. అనేక దేశాల రాజ్యాంగాలను ఔపోసన పట్టిన విజ్ఞాన గని. గొప్ప మానవతా వాది.

### అంబేద్కర్ చేసిన ఇతర సేవలు;

1949 నాటికి అనగా రాజ్యాంగ నిర్మాణం చర్చలు జరిగే సమయానికే అంటే.. ఇప్పుడున్న భారత దేశం ఏర్పడక ముందే, ఆయన దేశ ప్రజల హక్కుల కోసం చేసిన కృషి చాలా ఉంది. భారత దేశంలో ఉన్న కులవ్యవస్థ లో అగ్ర కుల మహిళలు కూడా పురుషుల తో సమానంగా హక్కులు లేని సమయంలో, రెండవ రౌండ్ టేబుల్ సమావేశం లో అందరికీ రాజకీయ హక్కులు కావాలని వాదించి ఓటు హక్కు సాధించారు. అంటే అంటారని కులాల వారి తో పాటు మహిళల కు మొట్ట మొదటి సారి ఓటు హక్కు సాధించారు. ఆవిధంగా మనుషులంతా ఒకటి అని గొప్ప ఫెమినిస్ట్ అయ్యాడు.బ్రిటిష్ ప్రభుత్వం లో కూడా లేబర్ మినిస్టర్ గా పనిచేశాడు . ఆ కాలంలో ఆయన కార్మికుల హక్కుల కోసం ఎన్నో చట్టాలు చేసిన విషయం అందరికీ తెలియక పోవచ్చు. కానీ, తెలియ చేయడం మన బాధ్యత.8 గంటల పని.ఆడ, మగ సమాన వేతనం.వారానికి ఒక రోజు సెలవు.మహిళల కు వేతనం తో కూడిన ప్రసూతి సెలవులు.ఆవిధంగా అనేక మంది కార్మికుల కోసం కులాల కతీతంగా సేవలు అందించిన కార్మిక నాయకుడు.ఈ రోజు రిజర్వ్ బ్యాంకు ఉంది అంటే అది ఆయన ఆలోచన ల నుండి పుట్టిన విషయం చాలా మంది కి తెలియదు.దాని వల్ల లబ్ధి పొందుతున్నది,కేవలం దళితులు మాత్రమే కాదు కదా! దేశం లో ఉన్న నూట నలభై కోట్ల మంది కి ఉపయోగ పడుతుంది."హిందూకోడ్ బిల్లు" ద్వారా మహిళా హక్కుల కోసం నిలిచిన ధీరుడు. అవే కదా తర్వాత అనేక స్త్రీల చట్టాలు గా వచ్చినవి.అటువంటి గొప్ప వ్యక్తిని కొందరికే పరిమితం చేయడం విచారకరం.ఆయన మన దేశంలో జన్మించడం మన అదృష్టం గా భావించాలి.డా. బి. ఆర్. అంబేద్కర్ అంటే.... కేవలం ఒక పేరు మాత్రమే కాదు. అది ఒక భావజాలం.నూట నలభై కోట్ల మంది భారతీయులు ఒకే జాతి అని రాజ్యాంగం ద్వారా ప్రపంచానికి తెలియ చేసిన గొప్ప జాతీయ వాది.ఆయన అందరివాడు.కొందరి వాడిగా చేయకండి.భారత దేశం ఉన్నంత కాలం రాజ్యాంగం ఉంటుంది.రాజ్యాంగం ఉన్నంత కాలం అంబేద్కర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతాడు.ఎవరు అవునన్నా కాదన్నా ఇది అంబేద్కర్ యుగం. ఇది సత్యం.

అంబేద్కర్ ఆలోచన వర్ధిల్లాలి!
భారత రాజ్యాంగం వర్ధిల్లాలి!!
జై భారత్,
జై భీమ్ లు తెలియజేసుకుంటూ..

## మలుపులు తిరుగుతున్న మంగ్లీ కేసు

**హైదరాబాద్ :** సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసేందుకు లాయర్ సుబ్బారావు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా హైడ్రామా చోటుచేసుకుంది. ఆల్కహాల్ తాగి వచ్చాడని అనుమానంతో సుబ్బారావుకు పంజాగుట్ట సీఐ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. రీడింగ్ 27 పాయింట్లు రాగా, మోతాదులోపు ఆల్కహాల్ తీసుకున్నట్టు నిర్ధారణ అయింది. అయితే తాను రాత్రి మద్యం సేవిస్తే ఉదయం పీఎస్‌కు వచ్చిన తనకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడం ఏంటని లాయర్ సుబ్బారావు పోలీసులను ప్రశ్నించారు. తనను అవమానించి, కేసు తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమైనా డ్రంక్ చేసి వాహనం నడిపానా ఏంటి.. కేవలం ఫిర్యాదు చేయడానికి కామన్ మ్యాన్‌లా పీఎస్‌కు వచ్చిన తనతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. తనపై మంగ్లీ చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని డిమాండ్ చేశారు. తనపై నిరాధార ఆరోపణలను చేయడంతో ఎంతో మందిని మోసం చేసిన సింగర్ మంగ్లీపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులను కోరారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తారు, వారి గురించి మీరు హడావుడి చేయవద్దు అని సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసులు సూచించారు. అయితే బాధితుల తరఫున తాను లీడ్ చేస్తున్నానని, లాయర్ గా వారికి అన్ని రకాలుగా చట్ట ప్రకారం సహాయం చేస్తానన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

### పాటే నా ప్రాణం.. నన్ను రోడ్డుకు లాగకండి: సింగర్ మంగ్లీ

మైక్రో ఫైనాన్స్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడ్డారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ తీవ్రంగా స్పందించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సదరు న్యాయవాదిపై ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఆమె తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మార్చి 21న సుభా సియపోగు అనే వ్యక్తి తనను కలిశారని, లాయర్ సుబ్బారావు అనే వ్యక్తితో కలిసి తనను అమర్యాదగా బెదిరించారని మంగ్లీ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు సంబంధం లేని కరెన్సీ నోట్ల వీడియోలు చూపించి, తనను కలవకపోతే పరువు తీస్తానని ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఈ పరిణామాలతో తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

### మీడియాకు మంగ్లీ రిక్వెస్ట్..

'నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు.. కేవలం పాటే నా ప్రాణం. ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే నిజనిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయవద్దు' అని మంగ్లీ మీడియాను వేడుకున్నారు. కేవలం ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ వ్యక్తి తనపై 150 కోట్ల మోసం అనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా ఎదిగిన తనకు, అదే శాపంగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన చెందారు. గతంలో తనపై రాజకీయ ముద్రలు వేయడంతో తర్వాత ఏ పార్టీకి కూడా తాను పాటలు పాడలేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

## విజయశాంతి రెడ్డి ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్

**హైదరాబాద్ :** హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి కోసం తన అత్తమామలు, బామ్మర్ది పెట్టిన మానసిక క్షోభ తట్టుకోలేకే తన భార్య ఈ దారుణ నిర్ణయం తీసుకుందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17) చర్లపల్లి–ఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.ఈ ఘటనపై తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి.. తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. "నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే నమ్మించి మోసం చేశారు. ఆస్తి కోసం తీవ్రంగా వేధించి, మానసికంగా కుంగదీసి వారి చావుకు కారణమయ్యారు" అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు చనిపోయిన 25 రోజులకే అత్త, బామ్మర్ది కలిసి తనను ఆస్తి కోసం బెదిరించడం మొదలుపెట్టారని సురేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.భార్యాపిల్లలు చనిపోయిన వెంటనే ఇంట్లో ఉన్న కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును తన అత్త పుష్పలత గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తనను కూడా టార్గెట్ చేశారని, తనకు ప్రాణహాని ఉందని ఆయన వాపోయారు. తాను కూడా చనిపోతే ఆస్తి మొత్తం వారికే దక్కుతుందనే దురుద్దేశంతో తనను అంతం చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ తనకు ఏమైనా జరిగితే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ఏదైనా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని, తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క పైసా కూడా దక్కనివ్వనని సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు.హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న విజయశాంతి, దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న సురేందర్ రెడ్డి దంపతులు బోడుప్పల్‌లో నివసించేవారు. జనవరి 30న హాస్టల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. సురేందర్ రెడ్డి తాజా ఫిర్యాదుతో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం.

**రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు :** రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం అని, రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమనీ అరైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు 13నుండి వారం రోజుల పాటు 18వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. నేర్చుకోవడంతో రక్షణ–సాంకేతికతతో మార్పు అనే నినాదంతో ఈ ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. "బీఏ రోడ్ సేఫ్టీ ఛాంపియన్" అంటూ పిలుపునిస్తూ, జిల్లాలోని వాహనదారులు, విద్యార్థులు, ప్రజలందరూ రహదారి నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో భారత్ అగ్రస్థానంలో ఉండటం అందరిని ఆందోళనకు గురి చేస్తున్న అంశమని గత ఏడాది గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 4,80,000 ప్రమాదాలు జరగగా, అందులో దాదాపు 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల వల్ల జీడీపీలో సుమారు 3.14శాతం ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, రహదారి ప్రమాదాలకు గురవుతున్న వారిలో 80 శాతం మంది 18 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గలవారే. కుటుంబానికి ఆధారమైన వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

## బిజినెస్

### ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

### 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ. 1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ. 1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ. 2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ. 264.90 పలుకుతోంది.

పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# ఈ లెక్కన ఎస్ఆర్‌హెచ్‌కు మూడినట్లే!




ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. బరిలోకి దిగిందే మొదలు బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న ఈ బుల్లోడు 266.66 స్ట్రైక్‌రేట్‌తో 200 పరుగులకు పైగా సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. తాను క్రీజులో ఉంటే బౌలర్ ఎవరైతే నాకేంటి.. బంతిపైనే తన దృష్టి ఉంటుందని ఇటీవలే ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం డైరెక్ట్ స్టేట్‌మెంట్ విడుదల చేయడం గమనార్హం. ఇప్పటివరకు రాజస్తాన్ ఆడిన ప్రతీ జట్టులో ఒక ప్రధాన బౌలర్‌ను వైభవ్ ఒక ఆట ఆడుకున్నాడు. చెన్నైతో మ్యాచ్‌లో మాట్ హెన్రీని, గుజరాత్‌తో మ్యాచ్‌లో రబాడను, ముంబైతో మ్యాచ్‌లో బుమ్రాను, ఆర్సీబీతో మ్యాచ్‌లో హాజిల్‌వుడ్‌ను లక్ష్యంగా చేసుకొని ఫోర్లు, సిక్సర్లు బాదాడు. ఇక ఇవాళ వైభవ్ సూర్యవంశీ ఎస్ఆర్‌హెచ్‌ను వారి సొంతగడ్డపైనే ఎదుర్కోనున్నాడు. బుమ్రా, హాజిల్‌వుడ్, రబాడ వంటి టాప్ బౌలర్లను ఉతికారేసిన వైభవ్ ముందు ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ చిన్నబోతోంది. కమిన్స్ లేకపోవడంతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనంగా తయారయ్యింది. ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ బౌలర్ లేకపోవడం మైనస్‌గా మారింది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఎస్ఆర్‌హెచ్ బౌలర్లు దారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. యావరేజ్‌గా చూసుకుంటే ప్రతీ ఓవర్‌కు 10.42 పరుగులివ్వడం గమనార్హం. ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలింగ్ పరంగా అత్యంత చెత్త ప్రదర్శన ఎస్ఆర్‌హెచ్‌దే. ఇక పేసర్ల పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది. హర్షల్ పటేల్, ఉనాద్కట్, ఇషాన్ మలింగలతో కూడిన పేస్ త్రయం ప్రతీ ఓవర్‌కు సగటున 11.47 పరుగులు సమర్పించుకున్నారు. ఈ లెక్కన ఇవాళ్టి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోమారు చెలరేగితే మాత్రం ఎస్ఆర్‌హెచ్ బౌలర్లకు మూడినట్లేనని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్ అంటేనే ప్రత్యర్థి జట్ల బౌలర్లు హడలెత్తిపోయేలా చేస్తున్నాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక ఐపీఎల్‌లో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్‌దే పైచేయిగా ఉంది. ఇప్పటివరకు ఇరుజట్లు 21 సార్లు తలపడితే ఎస్ఆర్‌హెచ్ 12 సార్లు, రాజస్తాన్ 9 సార్లు విజయాలు అందుకున్నాయి. సీజన్‌లో ఇప్పటికే వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న రాజస్తాన్ ఐదో విజయంపై కన్నేసింది. మరోవైపు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించిన ఎస్ఆర్‌హెచ్ సొంతగడ్డపై రెండో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది.

## మహిళల టీ20 వరల్డ్‌కప్.. 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ




దుబాయ్: ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్ హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.

## స్పోర్ట్స్

### డగౌట్‌లో సెల్‌ఫోన్.. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు




**గౌహతి:** రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ చిక్కుల్లో పడ్డారు. గత శుక్రవారం ఆర్సీబీతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో కనిపించారు. ఈ ఘటన పట్ల బీసీసీఐ సీరియస్‌గా ఉంది. రోమి బిందర్‌కు ఇవాళ బీసీసీఐ నోటీసులు జారీ చేసింది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు బిందర్‌పై ఆరోపణలు వస్తున్నాయి. టీమ్ డగౌట్‌లో ప్లేయర్లు ఉండే ప్రదేశంలో మేనేజర్ రోమి బిందర్ సెల్‌ఫోన్ చూస్తున్నట్లు దృశ్యాలు రిలీజ్ అయ్యాయి. పక్కనే కూర్చుకున్న వైభవ్ సూర్యవంశీ .. అతని ఫోన్‌ను తీక్షణంగా చూస్తున్నట్లు ఆ వీడియోలో ఉన్నది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎల్ చైర్మెన్ లలిత్ మోదీ కూడా డిమాండ్ చేశారు. బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూర్టీ యూనిట్(ఏసీఎస్‌యూ) రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ చర్యకు పాల్పడింది. అయితే 48 గంటల్లో ఆయన తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దేని కోసం రోమి బిందర్ డగౌట్ ఏరియాలో ఫోన్ పట్టుకున్నారో తన వివరణలో చెప్పాల్సి ఉంటుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఏసీఎస్‌యూ విభాగాన్ని ఆదేశించామని, దీనిపై నివేదికను ఇవ్వాలని కోరినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ ఓ మీడియాతో తెలిపారు. అయితే ఆరోగ్య కారణాల కోసం బిందర్ ఫోన్ వాడి ఉంటారని భావిసత్‌ఉన్నారు. గతంలో ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు ఆరోగ్య సమస్యలు ఎదరయ్యాయి. నాగపూర్‌లో ఓసారి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ కారణాల చేత ఆయన తన ఫోన్‌కు డగౌట్‌కు తీసుకెళ్లే వీలు ఉంది, కానీ అక్కడ కూర్చుని ఫోన్‌ను వాడరాదు అని నియమావళి ఉన్నట్లు తెలుస్తోంది. రోమి ఇటీవల 10 కిలోల బరువు తగ్గినట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తెలిసింది. అయితే రోమి మెడికల్ కండీషన్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ అధికారులు చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు.



## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'పై పెరుగుతున్న హైప్


పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా రోజురోజుకు వార్తల్లో నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్, నటీనటుల ఎంపికపై సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందని ఇప్పటికే టాక్. తొలుత మలయాళ స్టార్ టోవినో థామస్ ను నెగటివ్ రోల్ కోసం సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్ నడుస్తోంది. ఇక షూటింగ్ ఆగిపోయిందంటూ వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఎన్టీఆర్ లుక్ విషయంలో డైరెక్టర్‌తో విభేదాలు వచ్చాయని ప్రచారం జరిగినా, అందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రతి షెడ్యూల్ మధ్య గ్యాప్ తీసుకోవడం సాధారణమేనని, ప్రస్తుతం షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు చూడని రగ్గడ్, ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే లీక్ అయిన కొన్ని ఫొటోలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ లేదా టైటిల్ టీజర్ విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. ఈ సినిమా 2026 చివరిలో లేదా 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశం ఉంది.

## కాశీ అనుభవాలపై నటుడు ఆర్య సంచలన వ్యాఖ్యలు

### సాధువుల వేషంలో క్రిమినల్స్ ఉన్నారంటూ కామెంట్




తమిళ్‌తో పాటు తెలుగులోనూ హీరోగా, విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆర్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. త్వరలో విడుదల కానున్న తన కొత్త చిత్రం 'మిస్టర్ ఎక్స్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా ప్రారంభమయ్యాయి. తన కెరీర్ ప్రారంభంలో చేసిన నేనే దేవుడ్ని సినిమా షూటింగ్ సందర్భంగా ఎదురైన అనుభవాలను ఆర్య గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా కోసం వారణాసి (కాశీ)లో కొంతకాలం షూటింగ్ జరిపామని, అక్కడ నిజమైన సాధువులతో పాటు నకిలీ వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఆర్య మాట్లాడుతూ.. కాశీలో ఉన్న సాధువుల్లో చాలా మంది నిజాయితీ గలవాళ్లే. కానీ కొంతమంది మాత్రం సాధువుల వేషంలో క్రిమినల్స్‌గా ఉంటారు. వాళ్లకు ఎలాంటి గుర్తింపు పత్రాలు ఉండవు. పేరు అడిగినా 'స్వామి' అని మాత్రమే చెబుతారు. కొంతకాలం అక్కడ దాక్కొని తర్వాత వెళ్లిపోతారు" అని చెప్పారు అంతేకాకుండా కుంభమేళా సందర్భంగా కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశముందని ఆర్య వెల్లడించారు. "మేము కుంభమేళా షూటింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది సాధువుల వేషంలో ఆయుధాలు కూడా కలిగి ఉంటారని చెప్పారు అని ఆయన పేర్కొన్నారు. ఆర్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది ఆయన మాటలకు మద్దతు తెలుపుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడించారని అంటుండగా... మరికొందరు మాత్రం ఇలాంటి వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు.ఏదేమైనా, ఒక ప్రముఖ నటుడు ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. ఇది నిజంగా పరిస్థితులని ఉద్దేశించి చెప్పడమా ? లేక అతిశయోక్తి వ్యాఖ్యలా? అనే దానిపై ప్రస్తుతం నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ కొనసాగుతోంది.



## ఎస్క్వైర్ ఇండియా కవర్ పేజ్‌పై రామ్ చరణ్ మెరుపులు.. గ్లోబల్ స్థాయిలో అరుదైన గుర్తింపు!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేసుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన దర్శనమిచ్చారు. దుబాయ్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోటోషూట్‌లో రామ్ చరణ్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చరణ్... ఈ కవర్ ఫీచర్‌తో మరో మైలురాయిని అందుకున్నారు. గతంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ఆ ఘనత సాధించిన రెండో తెలుగు హీరోగా రామ్ చరణ్ నిలిచారు. దీంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటోషూట్‌లో చరణ్ స్టైలింగ్, ప్రెజెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటంతో, ఆయన గ్లోబల్ అప్పీల్ మరింత బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు ఆయన పూర్తి ఇంటర్వ్యూకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఒక పాట మినహా మిగిలిన భాగాలన్నీ కంప్లీట్ కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు యూట్యూబ్‌లో భారీ వ్యూస్ సాధించి మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. బుచ్చిబాబు స్టైల్ ఎమోషన్స్, చరణ్ మేకోవర్ కలిసి ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఒకవైపు అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై మెరుస్తూ, మరోవైపు క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న రామ్ చరణ్... ఈ ఏప్రిల్‌లో అభిమానులకు డబుల్ ట్రీట్ అందిస్తున్నాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## గోపీచంద్ 'భరతవర్ష' గ్లింప్స్ విడుదల..

### యోధుడిగా అదిరిపోయే లుక్, దేశభక్తి కథపై అంచనాలు పీక్స్!

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.





## ఎన్నాళ్లీ సింగిల్ బతుకు? క్లారిటీ ఇచ్చిన రామ్

తెలుగు హీరోల్లో బ్యాచిలర్స్ అనుకున్న వాళ్లకు కూడా ఒక్కొక్కళ్లకు పెళ్లిళ్లు అయిపోతున్నాయి. ప్రస్తుతం చూసుకుంటే ప్రభాస్, రామ్, సాయిధరమ్ తేజ్ లాంటి కొందరు మాత్రమే ఇంకా సింగిల్‌గా ఉన్నారు. వీళ్లలో ప్రభాస్ చేసుకుంటాడా అంటే సందేహమే. సాయిధరమ్ తేజ్ మాత్రం ఈ ఏడాదో వచ్చే ఏడాదో శుభవార్త చెప్పేలా ఉన్నాడు. రామ్ మాత్రం ఇప్పుడు తన సింగిల్ స్టేటస్, పెళ్లి వాటిపై పరోక్షంగా క్లారిటీ ఇచ్చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయమై స్పందించాడు. 'చిన్నప్పటి నుంచి నేను ఒంటరిగా ఉండటం అలవాటుపడ్డా. ఖాళీ టైంని ఒక్కడినే ఆస్వాదిస్తుంటా. స్నేహితులు, మిగతా వాళ్లతో గడపటం ఇష్టమే ?కానీ నాకోసం నేను టైమ్ కేటాయించుకోవడంలో ఆనందముంది. ఆ ఏకాంతం నాకు ఎంతో రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఎవరైనా నా జీవితంలోకి వస్తే వాళ్లతో సమయం గడిపేందుకు సిద్ధమే. రాకపోయినా ఒంటరిగా సంతోషంగా ఉంటాను. ఇదేదో కావాలని తీసుకున్న నిర్ణయమైతే కాదు' అని రామ్ చెప్పుకొచ్చాడు. రామ్ మాటల బట్టి చూస్తుంటే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతాడేమో అనిపిస్తుంది. ఇతడి గత సినిమా 'ఆంధ్ర కింగ్ తాలుకా' టైంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు రామ్ మాటల బట్టి చూస్తుంటే అవన్నీ ప్రమోషన్స్ కోసం సృష్టించినట్లే అనిపిస్తున్నాయి. ఇకపోతే ఇండస్ట్రీలో వందలాది మందితో పనిచేయడం గురించి మాట్లాడుతూ.. అది తప్పదని చెబుతూనే, అందరి మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్నానని చెప్పుకొచ్చాడు. లాక్‌డౌన్‌లో ఏడాదిన్నర పాటు ఒంటరిగానే బతికానని గుర్తుచేసుకున్నాడు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,